చిట్టిపొట్టి చిన్నారులు.. అపర దుర్గమ్మలు



విజయదశమి సమీపిస్తున్న వేళ చిన్నారుల సందడి ఇది. మలికిపురం మండలం గుడిమెళ్లంకలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థినులు అమ్మవారి వేషధారణలతో అలరించారు. -న్యూస్‌టుడే, మలికిపురం

అన్నవరంలో రేపట్నుంచి దసరా ఉత్సవాలు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో గురువారం నుంచి దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. 3వ తేదీ నుంచి 12 వరకు 9 రోజులు ఇవి జరగనున్నాయి. ప్రతి రోజూ ప్రధానాలయం, క్షేత్ర రక్షకులు వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. లక్ష కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలూ ఉంటాయి. 11న దుర్గాష్టమి సందర్భంగా చండీహోమం..12న విజయదశమి రోజు ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తారు. రాత్రికి కొండ దిగువన గజ వాహనసేవ, శమీపూజ అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో రావణ సంహారం ఉంటాయని అధికారులు తెలిపారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆయా విభాగాల అధికారులకు ఈవో కె.రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు.

◆ **అవతారాల్లో దర్శనం..**

3న బాలత్రిపుర సుందరి, 4న లక్ష్మీదేవి, 5న అన్నపూర్ణ, 6న శారదాదేవి, 7న కల్యాణగౌరి, 8న గాయత్రీదేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో క్షేత్ర రక్షకులు దర్శనమివ్వనున్నారు.

బాపూ మాట.. స్ఫూర్తి బాట

గాంధీ జయంతి నేడు

ఆ మహనీయుని ప్రతి మాట నేటి తరానికి స్ఫూర్తిమంత్రం.. ప్రతి సిద్ధాంతం ఆచరణాత్మకం..'అహింస' అనే ఆయుధంతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన జాతిపిత గాంధీజీ.. ప్రపంచవ్యాప్తంగా పరిమళించిన ఆయన కీర్తి ఎందరికో స్ఫూర్తి.. ఆయన లాంటి వ్యక్తి రక్తమాంసాలతో ఈ భూమిపై తిరిగారంటే తర్వాతి తరాలు నమ్మకపోవచ్చ'ని ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నారంటే బాపూ వేసిన ముద్ర ఏ స్థాయిదో అర్థం చేసుకోవచ్చు.. గాంధీ చూపిన బాట నాటికీ.. నేటికీ.. ఎన్నటికీ మార్గదర్శకమే. ఆయన జయంతి వేళ.. తూర్పుతో అనుబంధం.. ఆ అడుగుజాడల్లో నడుస్తున్న ప్రాంతాల గురించి అవలోకిస్తే..

'దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు.. గ్రామాలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది'..

- స్వచ్ఛత, శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువత అందులో భాగస్వాములు కావాలి.
- దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉంది.
- మనిషి ప్రకృతిలో మమేకం కావాలి.. అందులో అన్ని ప్రాణులకు భాగస్వామ్యం ఉందనే విషయం మరువకూడదు. మన అవసరాల కోసం ప్రకృతిని ధ్వంసం చేయకూడదు. అది భావితరాలకు శ్రేయస్కరం కాదు.'
- 'హింసను అహింసతో ఎదుర్కోవాలి. చెడును నిర్మూలించడానికి ఆయుధాలు పడితే జరిగేది రెండు దుష్టశక్తుల మధ్య యుద్ధం మాత్రమే..'
- 'ఈ ప్రపంచంలో నువ్వు చూడాలనుకుంటున్న మార్పు.. మొదట నీతోనే మొదలవ్వాలి.'

ఈనాడు, కాకినాడ



రాజోలులో గాంధీ బసచేసిన గృహం

నాటి జ్ఞాపకాలతో గాంధీ హౌస్

మామిడికుదురు, రాజోలు: స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో మరింత రగిలించేందుకు గాంధీ 1929 మే 5న తన భార్య కస్తూరిబాతో కలిసి రాజోలు వచ్చారు. పొన్నాడ సూర్యారావు ఇంట్లో రెండు రోజులు ఉన్నారు. స్వరాజ్య సాధన కోసం ప్రజల్లో ఉత్తేజాన్ని నింపే ఉపన్యాసాలు చేశారు. ఆ గృహమే గాంధీ హౌస్‌గా నేటికీ ఆకట్టుకుంటోంది. అదే పేరు మీదుగా న్యాయవాది పొన్నాడ హనుమంతరావు పుస్తకాన్ని ప్రచురించారు. ఇంటి ఎదుట నిలువెత్తు గాంధీ విగ్రహం, ఆయన విశ్రాంతి తీసుకున్న గది, కస్తూరిబా సందర్శించిన ప్రదేశం ఉన్నాయి.

మహాత్ముని అడుగుజాడలు

కిర్లంపూడి: ఉప్పు సత్యాగ్రహ యాత్రలో భాగంగా కిర్లంపూడి గాంధీ వచ్చారు. కొక్కొండ వెంకట రామశేషగిరిరావు పంతులు ఇంటిలో మహాత్ముడు భోజనం చేశారు. ఉద్యమం కోసం శేషగిరిరావు భార్య కృష్ణవేణమ్మ బంగారు కాసులపేరు, వెండి నాణేలు, కొంత నగదు అందజేశారు.



వి.కొత్తూరు గ్రామం


ఈ పల్లెలు మద్యానికి దూరం

కిర్లంపూడి, తుని గ్రామీణం: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో ఉన్న గ్రామం ముక్కొల్లు. 3900 మంది జనాభా అక్కడ ఉన్నారు. గత దశాబ్ద కాలంగా ఇక్కడ మద్యం ఊసే లేదంటే అతిశయోక్తి కాదు. అంతకుపూర్వం సారా తయారీ, బెల్టు షాపులు, మందుబాబుల వీరంగం, అరెస్టులు వంటివి ఉండేవి. ఎలాగైనా ఇక్కడి పరిస్థితులను మార్చాలని మహిళలు పెట్టుకొన్న సంకల్పం ఓ మార్పునకు దారితీసింది. గ్రామ పెద్దలు, యువత తోడవడంతో మద్యం అమ్మేవారిని, సారా తయారీదారులను నియంత్రించారు. ఇందుకు రెండేళ్లు పట్టింది. 2011 నుంచి మద్యరహిత గ్రామంగా పేరొందింది. ఇప్పుడు గ్రామం ప్రశాంతంగా ఉంది. అక్షరాస్యత కూడా ఎక్కువే. గతంలో బడికి వెళ్లని చిన్నారులు అధికంగా ఉండేవారు. ఇప్పుడు ప్రతి ఒక్కరు స్థానిక పాఠశాలలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్నారు.

● గ్రామ పెద్దలు నిర్ణయించిన ప్రకారం తుని మండలం వి.కొత్తూరు కొన్ని దశాబ్దాలుగా మద్యం విక్రయాలు లేని గ్రామంగా గుర్తింపు పొందింది. ఎవరైనా మద్యం, సారా, మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే గ్రామ కమిటీ సభ్యులు క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

పడవపై దాటి..

అల్లవరం: అల్లవరం మండలం బోడసకుర్రులో 1929 మే 5న గాంధీ దంపతులు పడవపై వైనతేయ గోదావరి నదిని దాటి రాజోలు చేరుకున్నారు. స్థానిక మత్స్యకారులు ఆ దంపతులను తెరచాప పడవపై నదిని దాటించినందుకు గుర్తుగా తపాలా శాఖ 2019లో తెరచాప గుర్తుతో ఉన్న ఓ కవర్‌ను, ప్రత్యేక స్టాంపులను విడుదల చేసింది.



తపాలా శాఖవిడుదల చేసిన ప్రత్యేక కవరు

పండగ వేళ ప్రత్యేక బస్సులు

దసరా పర్వదినమంటే కోనసీమకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వెళ్లినవారు స్వగ్రామాలకు తరలివస్తుంటారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో జరిగే వేడుకలను తిలకించేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది.. ఈనెల 8వ తేదీ నుంచి వీటిని తిప్పేందుకు అధికారులు కార్యచరణ ప్రారంభించారు. ఇప్పటికే ఆయా డిపోల్లోని సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు.

హైదరాబాద్, విజయవాడ, విశాఖలకు రాకపోకలు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

జిల్లాలోని అమలాపురం, రామచంద్రపురం, రాజోలు, రావులపాలెం ఆర్టీసీ డిపోల పరిధిలో దసరాకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం వంటి ముఖ్య ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు. ఈనెల 8నుంచి 11 వరకు హైదరాబాద్‌కు 40, విజయవాడ 20, విశాఖకు 20 బస్సులు వెళ్తాయి. తిరుగు ప్రయాణమయ్యేవారికి ఈనెల 13 నుంచి 16 వరకు హైదరాబాద్‌కు 40, విజయవాడ 20, విశాఖకు 20 సర్వీసులు వెళ్తాయి.



సాధారణ ఛార్జీలే

గతంలో మాదిరిగా కాకుండా ఈసారి ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలనే వసూలుచేస్తారు. రాకపోకలకు కలిపి ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే ఛార్జీలో 10 శాతం రాయితీ ఉంటుంది. ఇప్పటికే రిజర్వేషన్లను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అమలాపురానికి ఇంద్ర సర్వీసు రూ.1140, సూపర్ లగ్జరీకి రూ.900, అల్ట్రా డీలక్స్‌కు రూ.860 టిక్కెట్ ధర ఉంది. అమలాపురం డిపో పరిధిలో ఇంద్ర-2, సూపర్ లగ్జరీ-15, అల్ట్రా డీలక్స్-4 బస్సులు దసరాకు నడుపుతారు. హైదరాబాద్ నుంచి రాజోలుకు పండగకు రెండు సూపర్ లగ్జరీలు తిరగనున్నాయి. టిక్కెట్ ధర రూ.640. ఇక్కడి నుంచి అక్కడికి మరో మరో ఆరు నడుస్తాయి.

సద్వినియోగం చేసుకోవాలి

పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఆర్టీసీ బస్సులను అంతా సద్వినియోగం చేసుకోవాలి. కోనసీమ జిల్లా వ్యాప్తంగా నాలుగు డిపోల పరిధిలో 80 బస్సులు రావడానికి, 80 బస్సులు తిరుగు ప్రయాణానికి కేటాయించాం. ప్రయాణికుల సంఖ్యను బట్టి మరిన్ని అదనంగా ఏర్పాటుచేస్తాం.

ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి

బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో **4** డిపోలు
మొత్తం బస్సులు **329**
దసరాకు ప్రత్యేక బస్సులు **160** (రాను.. పోను ప్రయాణం)
గత ఏడాది పండగ ఆదాయం రూ. **50** లక్షలు
ఈ ఏడాది లక్ష్యం రూ. **60** లక్షలు



పుదుచ్చేరి వైట్ టౌన్‌లో ఫ్రెంచి నిర్మాణ శైలిలో కట్టిన ఓ భవనం

వారసత్వ సంపద

పుదుచ్చేరిలో 131 చారిత్రక భవనాల ఎంపిక

పుదుచ్చేరి.. చారిత్రక భవనాలకు నెలవు. వీటి పరిరక్షణకు అక్కడి ప్రభుత్వం నడుంబిగించింది. పుదుచ్చేరి వైట్ టౌన్‌లో ఫ్రెంచి, తమిళ సంస్కృతికి ప్రతీకగా 131 భవనాలు ఎంపిక చేసింది. బొలెవర్డ్ ప్రాంతంలోని 118 ప్రైవేటు భవనాలు, 13 మతపరమైన మందిరాలను రాష్ట్ర చారిత్రక వారసత్వ సంపద రక్షణ, సలహా కమిటీ సూచన మేరకు మంగళవారం ఖరారు చేసింది. కొన్నింటి ప్రాంగణాలలో అదనపు నిర్మాణాలు.. మరికొన్నింటి విస్తీర్ణంలో మార్పులు, ఇంకొన్నింటిని పునర్నిర్మించేలా నిర్ణయించింది. పుదుచ్చేరి వారసత్వ సంపదకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ కోకన్వీనర్ అశోక్ పాండా తెలిపారు. -న్యూస్‌టుడే, యానాం

నన్నయ పిలుస్తోంది

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు కౌన్సెలింగ్

నన్నయ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ), ఎంసీఏ కోర్సులలో భర్తీ చేయని సీట్లకు ఈనెల 5న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులే హాజరు కావాలని వీసీ వై.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వవిద్యాలయంతో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ఉంటుంది. వర్సిటీలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ప్రక్రియ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఉదయం 9.30 నుంచి 11 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సీట్లు, ఫీజు వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు.

-న్యూస్‌టుడే, రాజానగరం

బాలయోగి పేరిట జాతీయ క్రీడా ప్రాంగణం

జయంతి కార్యక్రమంలో ఎంపీ హరీష్‌మాథుర్

అమలాపురం పట్టణం: జీఎంసీ బాలయోగి పేరిట అమలాపురంలో రూ.40 కోట్లతో జాతీయ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీ గంటి హరీష్‌మాథుర్ పేర్కొన్నారు. లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి 73వ జయంతి కార్యక్రమం అమలాపురం పట్టణంలో మంగళవారం నిర్వహించారు. నల్లవంతెన దిగువన బాలయోగి ఘాట్‌లో ఎంపీ గంటి హరీష్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు నివాళి అర్పించారు. హరీష్ మాట్లాడుతూ బాలయోగి చేసిన అభివృద్ధే ఆయనను ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపిందన్నారు. కోనసీమ రైల్వేలైన్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమలాపురం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు మెట్ల రమణబాబు, చిక్కాల గణేష్, జవ్వాది తాతాబాబు, తెదేపా, జనసేన పార్టీ, భాజపా నాయకులు పాల్గొన్నారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు, భాజపా నాయకులు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



అమలాపురంలోని బాలయోగి ఘాట్‌లో ఎంపీ గంటి హరీష్ మాథుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తెదేపా నాయకులు

గడువులోగా ఓటరు జాబితా సవరణ

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జేసీ నిశాంతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా తయారీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటి సర్వే, ఫిర్యాదుల పరిష్కారం, 1500 ఓటర్లు దాటిన కేంద్రాలకు అదనంగా కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జిల్లాలో 99.58 శాతం సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. గుర్తింపు కార్డుల్లో తప్పిదాలను సరి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మంగళవారం అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ దూరదృశ్య సమావేశం నిర్వహించి ఓటరు జాబితా తయారీ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఆక్రమణల తొలగింపుపై.. అయిదేళ్లూ.. హైడ్రామా..!

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఏటా తుపానులకు మునిగిన పంట చేలల్లో నీరు 15 రోజుల వరకు దిగక పంట నాశనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అందుకు పొలాల్లోని మురుగు కాలువల వ్యవస్థ చిన్నాభిన్నం కావడమే కారణం. ఆక్రమణలు, చెంతనున్న ఆక్వా చెరువుల వ్యర్థాలు కాలువల్లోకి మళ్లిస్తున్నా. . గత వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లూ అధికారులు చేష్టలుడిగి చూశారు. ఆక్రమణలు తొలగిస్తామని, కాలువలు బాగు చేయిస్తామని కబుర్లు చెప్పారు. నిధులివ్వకుండా కర్షకులను నట్టేట ముంచారు.



ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో పెరుమాళ్లరాజు కోడు గట్టుపై ఆక్రమణలు

అక్కడిలా ఇక్కడా..

చెరువుల వ్యర్థాలను కట్టడి చేసేందుకు, ఆక్రమణలు తొలగించేందుకు రాజకీయ, అధికార బలం అడ్డుకోలేని హైదరాబాద్ తరహా హైడ్రా లాంటి పటిష్ఠ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నదాతలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ● జిల్లాలో 16 ప్రధాన, 36 మధ్యతరహా, 200కుపైగా చిన్నతరహా డ్రెయిన్లు ఉన్నాయి. ● అమలాపురం, రాజోలు సబ్ డివిజన్‌ల పరిధిలోనే పెద్దఎత్తున ఆక్రమణలున్నాయి. ● గతంలో అధికారులు సర్వే చేయగా 845 ఎకరాల వరకు ఈ డివిజన్‌లలోనే ఆక్రమణలు గుర్తించారు. ● ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, అల్లవరం, సఖినేటిపల్లి, రాజోలు తదితర మండలాల్లో డ్రెయిన్ల ఆక్రమణలు.● నీరు దిగువకు వెళ్లక ముంపు సమయాల్లో పంట నష్టపోతున్నామని 2022 ఖరీఫ్‌లో రైతులు పంట విరామం ప్రకటించారు. ● అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం డ్రెయిన్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని ఉత్తుత్తి హడావుడి చేశారు.

ఆక్వా చెరువుల నుంచి పూడిక..

డ్రెయిన్లు పనిచేయకపోవడానికి గుర్రపుడెక్క, ఆక్రమణలతోపాటు ఆక్వా చెరువుల నుంచి విడిచే పూడిక సమస్యలుగా పరిణమించాయి. రూ.లక్షల్లో చెరువులకు కౌలు చెల్లిస్తుండడంతో ఏడాది పొడవునా.. ఆక్వాకు వినియోగించే లైమ్, మేత వంటి వాటితో పాటు ఇతర రసాయన మందుల వ్యర్థాలను కాలువల్లోనే విడుస్తున్నారు.

ఆక్వాసాగు విస్తీర్ణం (వేల ఎకరాల్లో..):	
అధికారికంగా	35
అనధికారికంగా	10
డ్రెయిన్ల చెంత సాగు	80 శాతం



ముమ్మిడివరం: సోమిదేవరపాలెంలో కాలువలో గుర్రపుడెక్క

కాలువను కప్పేసి నిర్మాణాలు..

● ముమ్మిడివరం మండలం అయినాపురంలో ఇరుమండ డ్రెయిన్‌ను ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఈ గ్రామంలో రెండు డ్రెయిన్లు ఆక్రమణలకు గురికావడంతో ఏటా ఇక్కడి వరి చేలు మునుగుతాయి.

● ఐ.పోలవరం మండలం కేశనకుర్రులోని పెరుమాళ్లరాజు డ్రెయిన్‌నూ ఆక్రమించేయడంతో వర్షాలకు పెద్దఎత్తున వరి పంటకు నష్టం వాటిల్లుతోంది. డ్రెయిన్‌కు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర ఆక్వా చెరువులు, వాటిలో పూడిక 1500 ఎకరాల ఆయకట్టుకు శాపంగా మారాయి.

తొలిరోజు 97.8 శాతం పింఛన్ల పంపిణీ

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో తొలిరోజు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ 97.8 శాతం పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అక్టోబరు నెలకు సంబంధించి 2,40,267 పింఛన్లకు మొదటి రోజు 2,34,976 మంది లబ్ధిదారులకు సిబ్బంది రూ.97.61 కోట్లు అందించారు. జిల్లాలో అత్యధికంగా అంబాజీపేట మండలంలో 98.53 శాతం, అత్యల్పంగా కపిలేశ్వరపురం మండలంలో 96.52 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్ తెలిపారు.

మున్సిపల్ వైస్‌ఛైర్మన్ రాజీనామా

అమలాపురం పట్టణం: అమలాపురం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానానికి రాజీనామా చేసినట్లు తిక్కిరెడ్డి వెంకటేష్ మంగళవారం తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణికి రాజీనామా లేఖ అందజేశారు. కొంతకాలంగా ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని, వార్డు ప్రజలకు సేవలు అందించలేకపోతున్నానని పేర్కొన్నారు. ఆయన గత ఎన్నికల్లో వైకాపా తరపున 8వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.



వెంకటేష్

ఆర్థిక పురోభివృద్ధి దిశగా ప్రణాళికలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆర్థిక రంగం 15 శాతం వార్షిక అభివృద్ధి సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జేసీ నిశాంతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో దార్శనికత పత్రాల రూపకల్పనకు ప్రజా ప్రతినిధులు, మేధావులు, అధికారుల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వర్ణాంధ్ర విజన్ 2047తో సంక్షేమం, అభివృద్ధి, ఆర్థికాభివృద్ధికి తోడ్పడే విధంగా పాటు పడాలన్నారు. ఉజ్వల ఆంధ్రప్రదేశ్ సాధనే ధ్యేయంగా విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్థానికంగా మౌలిక వసతులు మెరుగు పడాలని, విద్యావ్యాప్తికి కళాశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని ప్రాంతాల్లో మాత్రమే ఆక్వా చెరువులకు అనుమతులు ఇవ్వాలన్నారు. జిల్లా ప్రణాళిక విభాగం అధికారి వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ నిశాంతి, వేదికపై ఇళ్ల తదితరులు

మద్యం అమ్మకాలకు వేలం పాట!

కాట్రేనికోన, న్యూస్‌టుడే: తీరగ్రామం చిర్రయానాంలో అక్రమంగా మద్యం అమ్మకాలకు మంగళవారం స్థానికంగా వేలంపాట నిర్వహించినట్లు తెలిసింది. స్థానికుడు సుమారు రూ.పది లక్షలకు విక్రయ హక్కులు దక్కించుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో మంగళవారం ప్రచారం జరిగింది. దీనిపై ఎస్సై అవినాష్ స్పందిస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలిసి తమ సిబ్బందిని అక్కడకు పంపించామన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు సాగకుండా ప్రత్యేక నిఘా పెడతామని ఆయన తెలిపారు.



స్వచ్ఛతా ప్రతిన

యానాం నెహ్రూ యువకేంద్రం, నేషనల్ సర్వీస్ స్కీం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్ రివర్‌బీచ్‌లో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. భారతమాత విగ్రహం వద్ద విద్యార్థులు, అధికారులు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. -న్యూస్‌టుడే, యానాం

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ ప్రారంభం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: గత పాలకులు ప్రజా పంపిణీ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. ఏడాదిన్నరగా రేషన్‌కార్డు దారులకు కందిపప్పు పంపిణీ నిలిపివేశారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు ఆకాశాన్నంటుతున్నా.. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కేవలం బియ్యం మినహా.. ఇతర సరుకులు పంపిణీ చేసిన పరిస్థితి లేదు. పంచదార సైతం అరకొరగా అందించేవారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళనకు చర్యలు చేపట్టింది. ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ ప్రారంభించింది.



ముమ్మిడివరంలో ఎండీయూ ద్వారా కందిపప్పు పంపిణీ

జిల్లాలో వివరాలు ఇలా..	
రేషన్ కార్డులు	5,47,722
రేషన్ దుకాణాలు	926
ఎండీయూలు	355

జిల్లాకు 185 టన్నులు మంజూరు

జిల్లాలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీని 30 శాతం నుంచి ప్రారంభించి.. విడతల వారీగా పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జిల్లాలో కార్డుదారులకు 539 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం కాగా.. ఈ నెలలో కనీసం 30 శాతం మంది కార్డుదారులకు అందించడానికి 185 టన్నులు మంజూరు చేశారు. మొదటి రోజు 15 మెట్రిక్ టన్నులు రేషన్ దుకాణాలను చేరవేసి ఎండీయూల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

రూ.1.72 కోట్ల లబ్ధి..

బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.170 వరకు ఉండగా.. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో రూ.67కే అందిస్తున్నారు. ఒక్కోకార్డుదారుకు రూ.93 లబ్ధి చేకూరుతుంది. జిల్లాలో 185 మెట్రిక్ టన్నులకు రూ.1.72 కోట్లు ప్రయోజనం చేకూరుతుంది. వంద శాతం పంపిణీ ప్రారంభిస్తే. . రూ.5.12 కోట్లు రాయితీ కల్పించినట్లవుతుంది.

పంపిణీ ప్రారంభించాం..

జిల్లాలో ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ ప్రారంభించాం. 185 మెట్రిక్ టన్నుల కందిపప్పు మంజూరు కాగా.. ప్రస్తుతం 15 మెట్రిక్ టన్నులు దుకాణాలకు చేరవేశాం. విడతల వారీగా లబ్ధిదారులకు కందిపప్పు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఎ.పాపారావు, డీఎస్‌ఓ, పౌరసరఫరాల సంస్థ డీఎం (ఇన్‌ఛార్జి)

జాడలేని చిరుత.. గుర్తించేందుకు రెండు బృందాలు



దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: చిరుతపులి జాడ దివాన్‌చెరువు అభయారణ్యం, కడియం ప్రాంతంలోని నర్సరీలు, రావులపాలెం, గోదావరి నదీ తీరంలో.. ఎక్కడా కనిపించడం లేదని తూర్పుగోదావరి జిల్లా అటవీశాఖాధికారిణి ఎస్‌.భరణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తించేందుకు రెండు బృందాలు ఆయా ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నాయన్నారు. గత నెల 19న దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు ట్రాప్‌ కెమెరాలో నమోదైందన్న ఆమె.. 24వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో కడియం నుంచి వీరవరం వెళ్లే రోడ్డులోని దోసాలమ్మకాలనీ దగ్గర ఎస్‌ఎస్‌టీసీ నర్సరీలో పాదముద్రలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆ రోజే వర్షం పడటంతో పాదముద్రలు ఆనవాళ్లు చెరిగి పోయాయన్నారు.

నేటి నుంచి పుష్కర వనంలోకి సందర్శకుల అనుమతి

గోదావరి మహాపుష్కర వనంలోకి బుధవారం నుంచి సందర్శకులను అనుమతిస్తున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. చిరుత కదలికల నేపథ్యంలో గత నెల 10వ తేదీ నుంచి దివాన్‌చెరువు అభయారణ్యం, పుష్కరవనంలోకి అనుమతులు నిలిపేశారు. ప్రస్తుతం చిరుత జాడ కనిపించకపోవడంతో పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా వికాస కేంద్రాల పనుల్లో కదలిక

రాజానగరం నియోజకవర్గం సీతానగరంలోని పువ్వాడ సత్యమాంబ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.2 కోట్లతో క్రీడా వికాస కేంద్రం మంజూరు చేసి రూ.25 లక్షలు విడుదల చేసింది. గుత్తేదారు ఉత్సాహంగా పనులు మొదలుపెట్టారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నాలుగేళ్లపాటు వాటి గురించి పట్టించుకోలేదు. ఎన్నికల వేళ రూ.45 లక్షలు మంజూరు చేసి పూర్తి చేస్తున్నామంటూ హడావుడి చేసింది. పనులు పూర్తికాకుండానే ఈ ఏడాది మార్చి 24న శిలాఫలకంపై వైకాపా నేతల పేర్లు వేసుకునేందుకు పోటీపడి.. శాప్‌కు అప్పగించకుండానే ప్రారంభించేశారు. ఇటీవల వర్షాలకు ఎక్కడికక్కడ లీకేజీలతో క్రీడా వికాస కేంద్ర భవన నిర్మాణంలో డొల్లతనం బయటపడడంతో కలెక్టర్ విచారణ చేపట్టారు.

- న్యూస్‌టుడే, సీతానగరం

వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో క్రీడారంగాన్ని నిర్లక్ష్యం చేసింది. అంతకు ముందున్న తెదేపా ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను పక్కన పెట్టేసింది. పలుచోట్ల క్రీడామైదానాలు చిట్టడవిని తలపించేలా తయారైనా 'ఆడుదాం-ఆంధ్రా' పేరుతో దోపిడీకి పాల్పడింది. క్రీడలపై ఆసక్తి గల యువత రెక్కలు విరిచేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల ప్రతిభ చచ్చుబడే నిర్ణయాలతో ఆటలాడుకొంది. నయాపైసా విదల్చకుండా గుత్తేదారులను ఇబ్బంది పెట్టి పనులు సైతం వదులుకునే పరిస్థితి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడావికాస కేంద్రాలు, మినీ స్టేడియం నిర్మాణాలపై దృష్టి పెట్టింది. నిలిచిపోయిన 36 క్రీడావికాస కేంద్రాలకు రూ.23 కోట్లు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు.



రాజమహేంద్రవరం నాగులాచెరువు వద్ద అసంపూర్తిగా క్రీడా వికాస కేంద్రం పనులు

ఒక్కో కేంద్రానికి రూ.2 కోట్లు

2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గంలోను క్రీడా వికాస కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించి.. మొదటి దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10 చోట్ల క్రీడావికాస కేంద్రాలు, మరో మూడుచోట్ల క్రీడా ప్రాంగణాల పనులు ప్రారంభించారు. కాకినాడ, ద్రాక్షారామ, సామర్లకోట, కొత్తపేట, రాజమహేంద్రవరం, దేవరపల్లి, పిఠాపురం, నిడదవోలు, కొవ్వూరు, దివాన్‌చెరువు తదితర చోట్ల ఒక్కో క్రీడా వికాస కేంద్రానికి రూ.25 లక్షలు చొప్పున విడుదల చేసి పనులు ప్రారంభించారు. అప్పట్లోనే సామర్లకోట, ద్రాక్షారామ, తుని కేంద్రాల నిర్మాణం పూర్తయింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా క్రీడా వికాస కేంద్రాల పనులన్నీ పక్కన పెట్టేసింది. అప్పటికే పూర్తయిన ద్రాక్షారామ కేంద్రాన్ని ప్రారంభించడానికి చర్యలు చేపట్టలేదు. దేవరపల్లిలో 90 శాతం, నిడదవోలులో 16 శాతం, కొవ్వూరు స్విమ్మింగ్ పూల్ 25 శాతం పనులతో నిలిచిపోయాయి.

ఉమ్మడి జిల్లాలో..

జిల్లా	క్రీడావికాస కేంద్రాలు	నిధులు (రూ.కోట్లు)
తూర్పుగోదావరి జిల్లా	04	8.5
కాకినాడ	03	6.5
అంబేడ్కర్ కోనసీమ	03	6.2

శాప్ ఇంజినీరింగ్ విభాగానికి బాధ్యతలు

క్రీడావికాస కేంద్రం పనుల పర్యవేక్షణ బాధ్యతలు ఆర్‌.అండ్‌.బీతోపాటు వేర్వేరు శాఖలకు గతంలో అప్పగించారు. తాజాగా ఆయా శాఖలను తప్పించి శాప్ ఇంజినీరింగ్ అధికారులకు అప్పగించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు. గతంలో క్రీడా వికాస కేంద్రం పూర్తిచేసి శాప్ చేతికి రావాలంటే ఎక్కువ పట్టేది. క్వాలిటీ కంట్రోల్ నివేదికలు వచ్చిన తర్వాతే పనుల పర్యవేక్షణ కింద అప్పటి శాఖలు సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. అనంతరం పూర్తి చేయించి శాప్‌కు అప్పగించేవారు. శాప్ నుంచి మళ్లీ ఆయా జిల్లాల స్పోర్ట్స్ అథారిటీలకు అప్పగించేవారు.

వేగవంతం చేయిస్తున్నాం..

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా నిలిచిన క్రీడావికాస కేంద్రాల పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. సీతానగరంలోని క్రీడావికాస కేంద్రం పనులు 90 శాతం పూర్తికావడంతో ముందుగా దాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. రాజమహేంద్రవరంలోని నాగులచెరువు వద్ద ఉన్న కేవీకే నిర్మాణాన్ని పూర్తిచేయించేలా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. 6 నెలలు కాలవ్యవధిలోనే ఇవన్నీ పూర్తిచేసేలా శాప్ ముందుకొస్తోంది.

- టీఎంఎం శేషగిరి, డీఎస్‌డీవో

అగస్త్యేశ్వరునికి సూర్యకిరణ స్పర్శ



మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలో రథంగుడిలోని అగస్త్యేశ్వరస్వామిని మంగళవారం సూర్యకిరణాలు తాకాయి. అత్యంత అరుదుగా ఈ కిరణాలు అగస్త్యేశ్వరస్వామి లింగాన్ని తాకుతుంటాయి. సెప్టెంబరు-అక్టోబరు నెలలో ఈకిరణాలు తాకుతుంటాయని ఆలయ అర్చకులు అయినివిల్లి సుబ్రహ్మణ్యం, ఆలయ ఈవో కామేశ్వరరావు తెలిపారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

రైల్వేలో ఆరు నెలలకోసారి పోస్టుల భర్తీ జరగాలి

వి.ఎల్‌.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రైల్వేలో ఆరు నెలలకోసారి ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ జరగాల్సిన అవసరం ఉందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్(ఎస్‌సీఆర్‌ఎంయూ) ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఎఫ్) కోశాధికారి సి. హెచ్‌. శంకరరావు అన్నారు. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో రైల్వే కార్మిక సంఘాలకు జరిగే గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన పర్యటించారు. సీఅండ్‌డబ్ల్యూ ఎస్‌ఎస్‌ఈ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేలో అన్ని విభాగాల్లో కలిపి ప్రస్తుతం 2 లక్షల ఖాళీలు ఉన్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేసే సిబ్బందికి ఎక్కువ సమస్యలున్నాయన్నారు. ట్రాక్‌పై పనిచేసే కార్మికులను స్కిల్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. గర్భిణులుగా ఉన్న మహిళా లోకో పైలట్లు రైలు ఎక్కి దిగే సమయంలో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వీరిని వేరే విభాగాల్లో పెట్టాలని, సేఫ్టీ రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు లోకోపైలట్లకు ఆరు గంటలు, ఎనిమిది గంటల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. కొన్ని విభాగాలకు రిస్క్ అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. యార్డ్‌లో పనిచేసే పాయింట్స్ మేన్‌కు ఉద్యోగోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. బాక్స్ బాయ్స్ వ్యవస్థ పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి కేటాయించినందున రాష్ట్రంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ వెంటనే ప్రారంభించాలని కోరుతున్నామని, దీనికి దసరాల్లో శంకుస్థాపన జరిగే అవకాశం ఉందని శంకరరావు చెప్పారు. కార్యక్రమంలో హిందూ మజ్దూర్ సభ(హెచ్‌ఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఎన్‌.శ్రీనివాస్, ఎస్‌సీఆర్‌ఎంయూ విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఎం.లీల, డివిజన్ అధ్యక్షుడు రామ్‌గుప్తా, అదనపు డివిజన్ కార్యదర్శి కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

వాడపల్లి క్షేత్రం.. వాహనాల నిలుపుదల కష్టం

పార్కింగ్ స్థలం సరిపడక ఇక్కట్లు

న్యూస్‌టుడే - ఆత్రేయపురం, రావులపాలెం పట్టణం

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వాహనాల నిలుపుదలకు సదుపాయం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శని, ఆదివారాలు, సెలవు, ఇతర పండగ రోజుల్లో 30 వేల నుంచి 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. సాధారణ రోజుల్లో భక్తుల సంఖ్య తక్కువగా ఉంటుంది. గోదావరి జిల్లాలకు చెందినవారు ఎక్కువ మంది ద్విచక్ర వాహనాలు, కార్లపై క్షేత్రానికి వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి కార్లు, బస్సులు కూడా వస్తున్నాయి. వీటి సంఖ్య పెరిగితే పార్కింగ్‌కు సమస్య మరింత జటిలమవుతుంది.

ఆర్టీసీ బస్సులు శనివారం 30 వరకూ రాకపోకలు సాగిస్తుంటాయి. కార్లు 300, ద్విచక్ర వాహనాలు 5 వేల వరకు ఉంటాయి. క్షేత్రం సమీపంలోని పార్కింగ్ స్థలం వద్ద కేవలం ద్విచక్ర వాహనాలు నిలపడానికి మాత్రమే స్థలం ఉంది. అదికూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఆలయ పరిసర ప్రాంతాలు, గ్రామంలోని వీధుల్లో, రహదారుల పక్కన వాహనాలు నిలిపి దర్శనానికి వెళ్తుంటారు. ఆయా రహదారుల్లో ఇష్టానుసారం నిలుపుతుండటంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామానికి ఆనుకొని ఉన్న కొత్త కాలనీలో ఏర్పాటు చేసిన పార్కింగ్ పల్లంగా ఉండటంతో వాహనాలు నిలుపుదల చేయడానికి వీలు లేకపోతోంది. ఓ మాదిరి వర్షం వస్తే జలమయం అవుతోంది. లొల్ల రజకపేట నుంచి ఏటిగట్టు మీదుగా పార్కింగ్ స్థలానికి వెళ్లాలంటే నరకప్రాయంగా ఉంటోంది. రహదారులు బురదమయంగా ఉండటంతో వాహనాలు దిగబడిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆలయానికి సమీపంలో స్వామివారి భూములను కౌలుకు ఇవ్వకుండా, కట్టుదిట్టంగా పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఆలయం వెనుక ప్రాంతంలో నిలిపిన వాహనాలు

స్వామివారి స్థలాలు సేకరిస్తాం

స్వామివారి ఆలయానికి ఉత్తరం వైపున ఉన్న ప్రదేశం సరిపడకపోవడం, కొత్తకాలనీ చెంతన పార్కింగ్ పల్లంగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతుండటం వాస్తవమే. గోశాల, గోవిందనగర్‌కు వెళ్లే ప్రధాన మార్గం చెంతన దేవస్థానం భూమిలో వాహనాలు నిలుపుదల చేయడానికి ఏర్పాటు చేస్తాం. భవిష్యత్తులో పార్కింగ్ సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. విజయవాడ వంటి సుదూర ప్రాంతాల నుంచి బస్సులు కూడా అధికంగా వస్తున్నాయి. సమీప ప్రదేశాల్లో ఉన్న స్వామివారి స్థలాలను తీసుకుని, పార్కింగ్ ప్రాంతాలుగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- రాపాక శ్రీనివాస్, పర్యవేక్షకుడు, వాడపల్లి దేవస్థానం

విదేశీ నోట్లు ఇస్తామని మోసం


24 గంటల్లోనే కేసు ఛేదన.. నిందితుల అరెస్టు

నరసాపురం: ఒక వ్యక్తికి విదేశీ నోట్లు ఇస్తామని నమ్మించి మోసగించిన కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలోనే ఛేదించారు. దీనికి సంబంధించి నరసాపురం ఎస్‌డీపీవో మురళీకృష్ణ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. సఖినేటిపల్లికి చెందిన రాపాక చంద్రరావు గతంలో గల్ఫ్ వెళ్లి వచ్చారు. ఈ అనుభవంతో విదేశాల నుంచి వచ్చిన వారివద్ద నుంచి విదేశీ కరెన్సీ నోట్లు, సెంటు సీసాలు, కళ్లజోళ్లు తదితర సామగ్రిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారు. ఇతని వ్యాపారం బాగా సాగుతుండటంతో అదే గ్రామానికి చెందిన గల్ఫ్ నుంచి వచ్చిన మేడిది వెంకటరెడ్డి కూడా ఇదే వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వైరం ఏర్పడింది. దీంతో చంద్రరావు ఏలూరు జిల్లా కలిదిండి వెళ్లి అక్కడ వ్యాపారం చేస్తున్నారు. అక్కడ కూడా వ్యాపారం బాగుండటంతో అసూయ చెందిన వెంకటరెడ్డి అతని వ్యాపారాన్ని నిరోధించాలని కొంత మందితో కలిసి కుట్రపన్నారు. దీంట్లో భాగంగా ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ సూర్యతేజ, భయ్యా హిమసాగర్ ఒక బృందంగా, కోరుకొండ గిరిబాబు, గంగరాజు, జవ్వాడి మలికిబాబు మరో బృందంగా ఏర్పడి చంద్రరావుపై దాడికి కుట్రపన్నారు. వారి పథకం ప్రకారం చంద్రరావుకు గతనెల 30న వెంకటరెడ్డి ఫోన్ చేసి తనవద్ద రూ.2 లక్షల విదేశీ కరెన్సీ ఉందని, వాటిని విక్రయిస్తానని నమ్మబలికాడు. మొగల్తూరు పోలీసుస్టేషన్ పరిధి రాజుగారితోట వద్దకు రావాలని చెప్పాడు. విదేశీ కరెన్సీ కోసం రూ.2 లక్షల నగదు తీసుకుని చంద్రరావు వచ్చారు. ప్రభుతేజ, మణికంఠ సూర్యతేజ, హిమసాగర్ వచ్చి రూ.2 లక్షల నగదు లాక్కుని చంద్రరావుపై దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నరసాపురం గ్రామీణ సీఐ దుర్గాప్రసాద్, మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు సిబ్బందితో కలిసి గాలించారు. నిందితులు ఏడుగురు పట్టణంలోని ఓ లాడ్జిలో ఉండగా గుర్తించి అరెస్టు చేసి రూ.1.70 లక్షల నగదు, ఖతార్‌కు చెందిన రియాల్ నోట్లు పది, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు బృందాన్ని ఎస్‌డీపీవో మురళీకృష్ణ అభినందించారు.

అక్విడక్టు నిర్వహణపై నిర్లక్ష్యం

చెట్లు తొలగించకపోతే మనుగడకే ముప్పు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: రాజోలు దీవికి జీవగుండెలాంటి పి.గన్నవరం డొక్కా సీతమ్మ అక్విడక్టు నిర్వహణ విషయంలో జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారు. ఈ కట్టడానికి దిగువన ఉన్న పి.గన్నవరం మండలంలోని అయిదు గ్రామాలతోపాటు మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలకు చెందిన సుమారు అయిదు లక్షలమంది జనాభాకు, వేలాది పశువులకు తాగునీరు, సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. రాజోలు దీవికి దీనిని జీవగుండెలా పరిగణిస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న అక్విడక్టుపై అయిదేళ్లుగా మొక్కలు మొలచి చెట్లుగా ఎదిగిపోతున్నాయి. అక్విడక్టుకు ఇరువైపులా ఉన్న వింగ్‌వాల్స్‌లోంచి చెట్లు పెరుగుతున్న తీరు దీనిని మనుగడకు నష్టం కలిగించేలా ఉంది. పలుచోట్ల రావిచెట్లు ఉన్నాయి. వీటిని పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక అక్విడక్టుపై రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. లైట్లు ఉన్నా అలంకార ప్రాయం. రాత్రి సమయంలో అంధకారంలో మగ్గుతుంది. ఎంతో ప్రాధాన్యతగల ఈ కట్టడం నిర్వహణ విషయంలో జలవనరులశాఖ ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.



పి.గన్నవరం వైపున అక్విడక్టు వింగ్‌వాల్ వద్ద పెరిగిన చెట్టు

చెట్లు తొలగించేందుకు చర్యలు

నేను మూడురోజుల క్రితం కొత్తగా డీఈఈగా బాధ్యతలు తీసుకున్నా. డొక్కా సీతమ్మ అక్విడక్టుతోపాటు, కాటన్ నిర్మించిన పాత అక్విడక్టును పరిశీలించి చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటా. డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డు మరమ్మతు పనులకు రూ.54 లక్షలు, లైట్లు మరమ్మతులకు రూ.36 లక్షలతో ప్రతిపాదించారు. ఈ పనులు కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

- నాగేంద్రకుమార్, డీఈఈ, జలవనరులశాఖ, పి.గన్నవరం సబ్‌డివిజన్

3 నుంచి లోవలో దసరా ఉత్సవాలు



తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఈనెల 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు ఈనెల 12 వరకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేయనున్నట్లు దేవస్థానం ఈవో, డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు. మహోత్సవాల్లో దర్శనాలకు వచ్చే భక్తులకు వసతులు కల్పించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.

శ్రీపీఠంలో ఏర్పాట్లు..

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణం రమణయ్యపేటలోని శ్రీపీఠంలోని ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు భారీగా నిర్వహించేందు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీవరకు మహాశక్తియాగం-2024లో భాగంగా దుర్గాష్టమి రోజున 64 మంది భక్తులతో ఒకే ప్రాంగణంలో శ్రీలలితా సహస్రవిరాట్ పారాయణం, పూజలకు సిద్ధం చేస్తున్నారు. రోజుకు 30 వేల మంది భక్తులు కుంకుమ పూజలు, 9న 24 వేలమంది విద్యార్థులతో సరస్వతి పూజలకు ఇప్పటికే పేర్ల నమోదు పూర్తయ్యింది. కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సర్పవరం సీఐ పెద్దిరాజు ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కాకినాడ డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సర్పవరం సీఐ పెద్దిరాజు

చరవాణికి బానిసై విద్యార్థి ఆత్మహత్య

యానాం: రోజూ సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడుపుతూ చదువుపై దృష్టి పెట్టలేక ఓ విద్యార్థి మానసిక ఒత్తిడికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. యానాం ఎస్సై మురుగానందన్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక యూకేవీ నగర్‌కు చెందిన ఆటో డ్రైవరు కుమారుడు(18) కాకినాడలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అక్కడ ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. సామాజిక మాధ్యమాల్లో ఆమెను అనుసరిస్తూ సెల్‌ఫోన్‌లో ఎక్కువ సమయం గడుపుతూ చదువును అశ్రద్ధ చేశాడు. సరిగా చదవలేక మానసిక ఒత్తిడికి గురై సోమవారం రాత్రి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మంగళవారం అతడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి): పాత (ముక్కుడు) కాయ	16,000-17,000
కొత్త (పచ్చి) కాయ	15,000-17,500
కొబ్బరినూనె మార్కెట్: 15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	116-00
రిటైల్ లైవ్	138-00
డ్రెస్డ్	200-00
స్కిన్‌లెస్	228-00

వృద్ధురాలి పింఛను సొమ్ము చోరీ

పిఠాపురం, న్యూస్‌టుడే: జగ్గయ్యచెరువుకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి మంగళవారం ఉదయం పింఛను కోసం తన మనవడిని వెంట తీసుకుని సచివాలయం-11కు వచ్చారు. కాసేపు నిరీక్షించాక పింఛను సొమ్ము అందింది. అప్పటికే ఇంటికి వెళ్లిపోయిన మనవడికోసం ఎదురుచూస్తుండగా పరిచయం లేని ఓ వ్యక్తి వచ్చి ఇంటి వద్ద దించుతానని చెప్పి ఆమెను ద్విచక్ర వాహనం ఎక్కించుకున్నాడు. వేరే దారిలో వెళ్తుండడంతో నిలదీయగా అతను రూ.4 వేల పింఛను సొమ్ము లాక్కుని, ద్విచక్ర వాహనంపైనుంచి తోసేయడంతో ఆమె గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు దర్యాప్తు ఆరంభించారు. విషయం తెలుసుకున్న పురపాలిక కమిషనర్ కనకారావు సొంత సొమ్ము రూ.4 వేలను సచివాలయ సిబ్బందితో ఆమెకు అందించారు.



బాధితురాలు అనంతలక్ష్మి

అప్పటి మంత్రి, ఎంపీ తెలుసంటూ.. ఉద్యోగాల పేరిట మోసం

ఎస్పీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

అమలాపురం పట్టణం, అల్లవరం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులతో దిగిన ఫొటోలను చూపించి అల్లవరం మండలం కొమరగిరిపట్నానికి చెందిన సబ్బిత సుజన్ ఉద్యోగాల పేరిట మోసం చేశాడని బాధితులు వాపోయారు. మంగళవారం ఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం ఎంపీగా ఉన్న చింతా అనురాధ తనకు బాగా తెలుసునని, వారితో చెప్పి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు వేయిస్తానని రూ.లక్షల్లో వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. అతడు విజయవాడ, కొత్తపేట, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ఇదే తరహా మోసాలకు పాల్పడినట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. అతడు విశ్వరూప్‌కు అత్యంత సన్నిహితుడుగా చెప్పుకొంటూ తిరిగేవాడని పలువురు చెబుతున్నారు. దీనిపై అల్లవరం ఎస్సై హరీష్‌కుమార్‌ను వివరణ కోరగా ఎస్పీ కార్యాలయం నుంచి విచారణ నిమిత్తం ఫిర్యాదు వచ్చిందన్నారు. అతడి గురించి ఆరా తీయగా రెండేళ్లుగా స్థానికంగా ఉండటం లేదని గుర్తించినట్లు చెప్పారు. అతడికి గతంతో ఏమైనా నేర పూరిత చరిత్ర ఉందా? అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన వారిలో ఒ.లక్ష్మణ్, సిరాటపు రాధా, కుమార్, మట్టా శివరామ భద్ర, గెడ్డం శ్రీనివాస్, కోలా నరేంద్ర కుమార్, ఎం.రాధ తదితరులు ఉన్నారు.

కారులో వెళ్లి రెక్కీ.. అదనుచూసి చోరీ

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: తీగ లాగితే డొంక కదిలినట్లు ఓ కేసులో నిందితులను అరెస్టు చేయగా.. వారి దొంగతనాల చిట్టా బయటపడింది. ఇటీవల అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీని పోలీసులు ఛేదించారు. అక్కడ చోరీకి గురైన సుమారు రూ.70 లక్షలు విలువైన 868 గ్రాముల బంగారం, 8.56 కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కృష్ణారావు ఆ వివరాలను వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న నగలు చూపిస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఏఎస్పీ ప్రసాద్

జల్సాలకు అలవాటుపడి..

శ్రీకాకుళం జిల్లా గుర్రాలమెట్టకు చెందిన సవర సూర్య(25), సవర చిన్నారావు (24) జోగివలస గ్రామవాసి సవర రజని (24), కారికూడకు చెందిన బత్తిని శ్రీకాంత్ (25) జల్సాలకు, వ్యసనాలకు అలవాటుపడి చోరీల బాటపట్టారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగిన తర్వాత పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో సీసీటీవీ పుటేజీల ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు.

శివారు ఆలయాలే లక్ష్యం..

భద్రత లేని ఊళ్లకు శివారులో ఉండే దేవాలయాలకు అద్దె కారులో వెళ్లి రెక్కీ నిర్వహిస్తున్నారు. సమయం చూసి చోరీకి పాల్పడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో-37, విశాఖపట్టణం, ప్రకాశం, గుంటూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున నేరాలకు పాల్పడ్డారు. ఇతర రాష్ట్రాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. వీరి నుంచి కారు, నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్ని కేసుల్లో నిందితులను పట్టుకోవడం స్థానికంగా ఇదే తొలిసారని ఎస్పీ చెప్పారు. సీఐలు వీరబాబు, ప్రశాంత్‌కుమార్, ఎస్సై వై.శేఖర్‌బాబు, ఏఎస్‌ఐ ఎ.బాలకృష్ణ, కానిస్టేబుళ్లకు నగదు బహుమతి అందజేసి అభినందించారు.

శ్రీకాకుళంలో కొందరు అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం: సుమారు 32 ఆలయాలు, 3 బియ్యం మిల్లులు, నాలుగు ఇళ్లలో చోరీలు చేసిన అయిదుగురు నిందితులను అరెస్టు శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. వారి నుంచి సుమారు రూ.91.38 లక్షల విలువైన 692 గ్రాముల బంగారం, 52.880 గ్రాములు వెండి ఆభరణాలు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇదే కేసుల్లో మరో నలుగురిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసులు పట్టుకున్నారని చెప్పారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న శ్రీనివాస్

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం): వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన పేరిచర్ల సూర్యనారాయణరాజు రూ.1,01,000 విరాళాన్ని మంగళవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం పర్యవేక్షకుడు రాపాకా శ్రీనివాస్ అభినందించారు.

ఈకేవైసీకి 4 వరకు గడువు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: జిల్లాలో ఖరీఫ్ వరి పంటకు సంబంధించి నూరుశాతం 'ఈ-పంట' నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తెలిపారు. 'ఈకెవైసీ' నమోదుకు ఈ నెల నాలుగో తేదీ వరకు గడువు ఇచ్చినట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 1,01,625 మంది రైతులు ఈకెవైసీ చేయించుకోవాల్సి ఉండగా 93.87 శాతం పూర్తయిందన్నారు.

రైస్ మిల్లర్ల సంఘం సంయుక్త కార్యదర్శిగా వైట్ల



ఆలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్త కార్యదర్శిగా వైట్ల కనకదుర్గారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఆలమూరులో ఈ విషయాన్ని వెల్లడించారు.

అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి వినతి

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్న అగ్నికుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేయాలని రాజోలు నియోజకవర్గానికి చెందిన పలువురు తెదేపా నేతలు విజయవాడలో మంత్రి కొల్లు రవీంద్రను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఇసుక ర్యాంపులు మత్స్యకార సొసైటీల ద్వారా నిర్వహణ జరిగేలా చేసి తమ జీవనోపాధికి పాటుపడాలని కోరినట్లు చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ సభ్యుడు తిరుమాని ఆచార్యులు, సఖినేటిపల్లి మండల తెదేపా అధ్యక్షుడు ఇల్లింగి వెంకటరమణ, సఖినేటిపల్లి మండల తెదేపా బీసీసెల్ అధ్యక్షుడు కొల్లు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి రవీంద్రకు సమస్యను వివరిస్తున్న తెదేపా నేతలు

ఏకరూప దుస్తుల పంపిణీ

అయినవిల్లి: నేదునూరు హైస్కూల్ ప్లస్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రీజనల్ హెడ్ రాధాకృష్ణ రూ.25,000 విలువ గల ఏకరూప దుస్తులు అందజేశారు. సర్పంచి జి.ప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

మహాత్ముని ఆశయాలే స్ఫూర్తిగా..

మహాత్మాగాంధీ ఆశయ సాధనకు వారంతా తమవంతు కృషి చేస్తున్నారు. కొంతమంది యువత స్వచ్ఛంద సంస్థల ఏర్పాటుతో ప్రజల్లో మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే మరి కొందరు మహిళలు తమతో పాటు మరి కొందరికి ఆర్థికంగా నిలదొక్కుకునే తోడ్పాటు అందిస్తున్నారు. మరోవైపు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు, మలికిపురం, అంబాజీపేట

ఆర్థిక స్వావలంబన దిశగా..

పుల్లేటికుర్రులోని మహిళలు మగ్గాలపై చీరలు తయారు చేసి విక్రయించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. 2007లో శ్రీసాయికిరణ్ మహిళా సంఘాన్ని పది మంది కలిసి ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక యూనియన్ బ్యాంకులో ఒక్కొక్కరు రూ.30 నుంచి రూ.100 పొదుపు చేసుకుంటూ వచ్చారు. ఈ సంఘం ఆర్థికంగా అభివృద్ధి వైపు అడుగులు వేయడంతో తొలుత ఒక్కొక్క సభ్యురాలికి రూ.5 వేలు రుణాన్ని అధికారులు ఇచ్చారు. ఇప్పుడు రూ.2 లక్షల వరకు రుణం తీసుకుంటున్నారు. వీటితో మగ్గం, రాట్నం, నాడి, అచ్చుబొండ, డోని, నాడి, పలక, జువ్వలు, లాక్‌లు, ఊచలతో పాటు కండెలు, డిజైన్ యంత్రాల సాయంతో రూ.150 నుంచి రూ.16 వేలు విలువ చేసే పట్టుచీరలను తయారుచేసి విక్రయించడం ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. అంబాజీపేట ఏపీఎం గంగాధర్ సహకారం అందిస్తున్నారు.


పుల్లేటికుర్రులో మగ్గంపై చీర నేసిన మహిళలు

పర్యావరణ హితానికి..

కేశనపల్లికి చెందిన తోట ఉమామహేశ్వరి పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొంది పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వివిధ శుభకార్యాల సందర్భంగా కానుకలుగా ఇవ్వడానికి పౌచ్‌లు, హ్యాండ్, లంచ్, వాటర్, ట్రావెల్ బ్యాగులు, కిరాణా సంచులు, ల్యాప్‌టాప్‌లు తీసుకెళ్లే బ్యాగులు తయారు చేస్తున్నారు. మరిన్ని మిషన్లు కొనుగోలు చేసి మరో పదిమందికి శిక్షణ ఇస్తున్నారు. ఆమె చొరవను చూసి స్థానిక ఆక్సిజన్ అసోసియేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో కేశనపల్లి, పడమటిపాలెం, గూడపల్లి గ్రామాల్లో మూడు బ్యాచులుగా 90 మంది మహిళలకు జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇచ్చారు.


మహిళకు శిక్షణ ఇస్తున్న ఉమామహేశ్వరి

ఆపన్నులకు అండగా..

మామిడికుదురుకు చెందిన మానవత్వం స్వచ్ఛంద సంస్థ మహాత్ముని స్ఫూర్తితో పలు సేవా కార్యక్రమాలు చేపడుతోంది. 2020లో ఏర్పడిన ఈ సంఘం విద్యా వికాసానికి దోహదం చేసే సదస్సులతో పాటు బాల్య వివాహాల వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పిస్తోంది. ఉచిత వైద్య, రక్తదాన శిబిరాల ఏర్పాటు, పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీ, వృద్ధ, అనాథ ఆశ్రమాలు, పలు శివారు కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మహాత్ముని బోధనలు, ఆశయాలు విద్యార్థులకు తెలియజేసేందుకు గాంధీ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవ సమయాల్లో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులిస్తున్నట్లు అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్, సంఘ సభ్యులు తెలిపారు.


భోజన పొట్లాలతో నిర్వాహకులు

ప్రహరీ సమస్యకు పరిష్కారం

రాజోలు: రాజోలులో నూతనంగా నిర్మిస్తున్న పోస్టాఫీస్ భవనానికి సంబంధించిన ప్రహరీ పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్నారని గ్రామస్థులు చేసిన ఫిర్యాదు మేరకు ఆ శాఖ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. మూడు అడుగుల మేర స్థలం వదిలి లోపలికి నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్, ఏఈ సూర్యనారాయణరెడ్డి, హెడ్ పోస్ట్‌మాస్టర్ జి.ప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్, సర్పంచి రేవు జ్యోతి పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఏఐఎస్ఎఫ్ పోరాటం కొనసాగుతుందని సంఘ జిల్లా కన్వీనర్ రవికుమార్ అన్నారు. రావులపాలెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మంగళవారం సంఘం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.సురేష్, ప్రధాన కార్యదర్శిగా జి.సందీప్, కోశాధికారిగా సంతోష్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు ఎన్నికయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ ఛార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు రామకృష్ణ, శామ్యూల్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే దేవ

మలికిపురం, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండలంలోని మేడిచర్ల పాలెం, దిండి గ్రామాల్లో మంగళవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. ఎంపీడీవో బి.మంగాదేవి, కార్యదర్శి సుభాకర్‌బాబు, సర్పంచి మేడిచర్ల వల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు చర్యలు: ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట: అంబాజీపేట ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మాచవరంలోని కామయ్యకోడు రక్షిత తాగునీటి పథకాన్ని మంగళవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభంతో కలిసి పరిశీలించారు. ఈ పథకాన్ని ఈ నెల 16న ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఇతర అధికారులు, కూటమి నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి పాల్గొన్నారు.


ఆలమూరులో..


రావులపాలెంలో..

అలరించిన నవదుర్గలు

దసరా పండగను పురస్కరించుకుని గుడిమెళ్లంకలోని భాష్యం ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేషధారణలో విద్యార్థినులు అలరించారు. ఎంఈవో వైవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఆలమూరు శ్రీ సిద్ధార్థ, రావులపాలెంలోని శ్రీసిద్ధార్థ పాఠశాలల్లో ముందస్తు ఉత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, మలికిపురం, ఆలమూరు, రావులపాలెం పట్టణం

ఆర్టీసీ ప్రయాణికుల పాట్లు

రాజోలు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు టైరుకు పంక్చర్ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరం నుంచి రాజోలు వెళుతున్న బస్సు మంగళవారం ఉదయం లంకలగన్నవరం వద్ద ఆగిపోయింది. ఆ సమయంలో 66 మంది ప్రయాణికులతో పాటు మరో 20 మంది కళాశాల విద్యార్థులు ఉన్నారు. దీంతో వారిని వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపారు. అప్పటివరకు రహదారి పక్కనే నిరీక్షించాల్సి వచ్చింది. – న్యూస్‌టుడే, పి.గన్నవరం



పైపులైను ఏర్పాటుకు భూమిపూజ

మలికిపురం, న్యూస్‌టుడే: లక్కవరం మంగెనవారి వీధిలో రూ.5 లక్షలతో మంచినీటి పైపులైను నిర్మాణానికి మంగళవారం ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పైపులైను నిర్మాణంతో ఈ ప్రాంత కుటుంబాలకు తాగునీటి సరఫరా మెరుగవుతుందన్నారు. సర్పంచి కోట పుష్పకుమారి, మంగెన నాగభూషణం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెం మధ్యగ్రూపు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కాకినాడ శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 134 మందికి డాక్టర్ కృష్ణ కంటి పరీక్షలు చేయగా 20 మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. తోట భానుప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు కనకలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

రాజోలు: రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ముగింపు సభ మంగళవారం జరిగింది. ప్రిన్సిపల్ పి.సాయిబాబు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని విద్యార్థులకు సూచించారు. పీఎస్ఆర్ ట్రస్ట్ సమకూర్చిన 200 నార సంచులను అందజేశారు. ఆ ట్రస్ట్ ఛైర్మన్ నాగరాజు, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పడమటిపాలెంలో యోగాసనాలతో నిరసన తెలుపుతున్న నాయకులు

తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీపై నిరసన

మలికిపురం, కొత్తపేట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీ సంఘటనపై పడమటిపాలెంలో యోగాసనాలు వేసి నిరసన తెలిపారు. హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఎ.రామచంద్రరావు, ఎస్.భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.


వానపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జనసేన నాయకులు

★ నెయ్యి కల్తీకి ప్రాయశ్చిత్తంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు సంఘీభావంగా కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రేణులు వానపల్లి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నారాయణ మంత్ర పఠనం చేశారు.

అప్పనపల్లి నుంచి తిరుమలకు దీక్షాధారులు

మామిడికుదురు: సనాతన ధర్మ పరిరక్షణ, తిరుపతి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీకి సంబంధించి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా అప్పనపల్లి బాల బాలాజీస్వామి ఆలయంలో అయిదుగురు జనసైనికులు 11 రోజుల దీక్షను మంగళవారం పూర్తి చేసుకున్నారు. తిరుమలలో తమ దీక్షను విరమించేందుకు ఇక్కడినుంచి బయల్దేరి వెళ్లారు. కంకిపాటి నరసింహారావు, తుండూరి బుజ్జి, బళ్ల సతీష్, జవ్వాది నాని, కుంపట్ల దుర్గారావు దీక్ష చేపట్టిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో యెరుబండి చిన్ని, గుళ్లింక గంగాధర్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై ఫిర్యాదు

మలికిపురం, న్యూస్‌టుడే: విశ్వేశ్వరాయపురం పంచాయతీ కార్యాలయం ఎదుట కత్తిమండ మైనరు డ్రెయిను గట్టును ఆక్రమించి నిర్మించిన గోడ, షెడ్డు నిర్మాణాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు జలవనరులశాఖ ఏఈ(డ్రెయిన్సు విభాగం) బి.రేష్మ మంగళవారం తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి గతంలో నోటీసులు ఇచ్చినా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి తహసీల్దారు సీఎస్ రాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అక్రమ కట్టడాలను తొలగించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బంగారు, వెండి ఆభరణాల అపహరణ

కొత్తపేట, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకుపోయిన సంఘటన కొత్తపేట మండలం గంటిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాయుడు వీరన్న కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 27న హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని వీరన్న సోదరుడు సూరిబాబు గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తరుపులు తెరచి ఉన్నాయి. 4 తులాలు బంగారం ఆభరణాలు, 2 కేజీల వెండి వస్తువులు పోయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే వీరన్న హైదరాబాద్ నుంచి ఆయన వచ్చిన తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని, ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఎస్సై సురేంద్ర సంఘటన ప్రాంతానికి క్లూస్ టీంతో వెళ్లి పరిశీలించి, వేలి ముద్రలు సేకరించారు.


పి.గన్నవరంలో... నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



కొత్తపేటలో ఎమ్మెల్యే బండారు తదితరుల నివాళి

చిరస్మరణీయుడు బాలయోగి

మలికిపురం, రాజోలు, అయినవిల్లి, అంబాజీపేట, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం, కొత్తపేట, న్యూస్‌టుడే: అభివృద్ధి ప్రదాతగా.. అజాతశత్రువుగా.. బాలయోగి ప్రజా హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లోక్‌సభ మాజీ స్పీకరు, దివంగత జీఎంసీ బాలయోగి జయంతిని పురస్కరించుకుని దిండిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మలికిపురం శ్రీరామ్‌నగర్‌లో కూడా బాలయోగి జయంతిని నిర్వహించారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, ఎంపీపీలు మేడిచర్ల వెంకటసత్యవాణి, కేతా శ్రీనివాస్, దిండి సర్పంచి ముదునూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ★ పి.గన్నవరం అక్విడక్టు వద్ద బాలయోగి విగ్రహానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ★ రాజోలు కాటన్ పార్క్‌లో ఉన్న విగ్రహానికి మండల తెదేపా అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ నివాళి అర్పించారు. ★ అయినవిల్లి ఎంపీడీవో కార్యాలయం, ఎటుగట్టు వద్ద ఉన్న విగ్రహాలకు మండల తెదేపా అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్యానాయుడు పాల్గొన్నారు. ★ తెదేపా జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకటసత్యనారాయణ, బీసీ విభాగం కార్యదర్శి బొంతు పెదబాబు, కోనసీమ జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి రవణం రాము అంబాజీపేటలో నివాళులర్పించారు. ★ మలికిపురం శ్రీరామనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పాల్గొని నివాళులర్పించారు. ★ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రావులపాడులో కాలువగట్టు వద్ద ఉన్న బాలయోగి, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. కొత్తపేట పాతబస్టాండు వద్ద బాలయోగి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.


దిండిలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

నరసాపురం, న్యూస్‌టుడే: గంజాయి రవాణా కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బి.యాదగిరి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రెండు కిలోల గంజాయి కలిగి ఉన్నట్లు 2023లో నమోదైన కేసులో ముగ్గురు నిందితులను గతంలోనే అరెస్టు చేశారు. ఆ కేసులో పరారీలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం దిండి గ్రామానికి మేడిది నరేశ్ (26)ను తాజాగా అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించారని సీఐ తెలిపారు

జాతరలా పింఛన్ల పంపిణీ

కొత్తపేట, రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగో నెల పింఛన్ల పంపిణీ జాతరలా కొనసాగుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి వెయ్యి పెంచి నాలుగు వేలు ఇచ్చి మాట నిలబెట్టుకున్నామన్నారు. మంగళవారం కొత్తపేట మండలం వాడపాలెం, బిళ్లకుర్రు, రావులపాలెం మండలం రావులపాడు, ఆలమూరు మండలం పెనికేరు, కలవచర్లలో రాజమహేంద్రవరం డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబుతో కలసి పింఛన్లు అందజేశారు. నియోజకవర్గంలో 43,047 మందికి రూ.18,15,85,000 పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

★ రావులపాడులో పింఛన్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నగదు పంపిణీ చేశారు. నెక్కంటి వెంకన్న, సర్పంచి మట్టా సత్యాదేవి, గుత్తుల రాంబాబు, పమ్మి శ్రీను, గెడ్డం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.


విజేత విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత

రాజోలు, న్యూస్‌టుడే: ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాజోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుహాసిని తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో పి.నాగేశ్వరి, ఎన్.రాము, పి.హేమధనశ్రీ, అండర్-14 చదరంగంలో వి.జ్యోత్స్న, అండర్-14 తైక్వాండోలో వై.గంగాభవాని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. వీరిని మంగళవారం ఎంఈవో నల్లి మనోహరం, ఎస్ఎంసీ ఛైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

చదరంగం పోటీలకు సాయివర్షిత..



రావులపాలెం పట్టణం: రావులపాలేనికి చెందిన కర్రి సాయివర్షిత రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యింది. స్థానిక సిద్ధార్థ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వర్షిత కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పాల్గొని విజయం సాధించిందని పాఠశాల డైరెక్టర్ ముల్లారావు తెలిపారు.

అమ్మో.. దొంగలు

వరుస చోరీలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

– న్యూస్‌టుడే, అంబాజీపేట

అంబాజీపేటలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత రెండు, మూడు నెలలుగా ఈ పరంపర కొనసాగుతోంది. దాచుకున్న బంగారం, వెండి వస్తువులతో పాటు నగదును అపహరించుకుపోతున్న సంఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. దేవాలయాలు, ఇళ్లు, మహిళలే లక్ష్యంగా ఈ చోరీలు చోటుచేసుకోవడం గమనార్హం. పోలీసుల గట్టినిఘా ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు. మాచవరం, అంబాజీపేట, మొసలపల్లి, కె.పెదపూడి గ్రామాల్లోని దేవాలయాల్లో దొంగతనాలు చోటు చేసుకున్నాయి. హుండీలు పగులుకొట్టి చోరీలకు పాల్పడ్డారు.

★ గంగలకుర్రు అగ్రహారం పంచాయతీ పరిధి పీర్మాయిపాలెంలో ఓ దుకాణంలో ఉన్న మహిళ వద్దకు ఓ వ్యక్తి వచ్చి సరకులు కొనుగోలు చేస్తున్నట్లు నమ్మించి మెడలో ఉన్న బంగారుతాడు దోచుకుపోయాడు. ★ ఆగస్టు 24న పీర్మాయిపాలెం గ్రామానికి చెందిన గ్రంధి మహాలక్ష్మి స్థానిక శివాలయం నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలోని బంగారు తాడు, నల్లపూసల తాడు ఎత్తుకుపోయారు. ★ సెప్టెంబరు 9న కముజువారిలంకలోని వినాయకుడి ఆలయం వద్ద శ్రీపాద సీతారామలక్ష్మి పూజలు చేసుకుంటున్న సమయంలో అక్కడ ఉన్న హుండీలో డబ్బులు వేస్తున్నట్టు నటించిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని విలువైన బంగారు వస్తువులు(ఆరు కాసులు) అపహరించుకుపోయారు. ★ ముక్కామలలో దుకాణం కట్టేసి ఇంటికి వెళుతున్న మోరంపూడి నాగమణి మెడలో మంగళసూత్రాలు, బంగారుతాడును మోటార్‌సైకిల్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. ★ జులై 14న గంగలకుర్రు అగ్రహారంలోని ఓ ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి, వస్తువులతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. ★ సెప్టెంబరు 28న అర్ధరాత్రి దాటిన తరువాత అంబాజీపేట పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఎరువుల దుకాణం, వీరభద్రా టాకీసు సమీపంలోని విజయ కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగింది.


గంగలకుర్రు అగ్రహారంలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (పాత చిత్రం)

నిఘా పెంచుతాం..

పోలీసు నిఘా మరింత పెంచుతాం. దొంగలను గుర్తించి బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రజలు కూడా విలువైన వస్తువులతో పాటు నగదును ఇళ్లలో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచుకోవాలి. రానున్న దసరా పండగ సందర్భంగా ఊళ్లకు వెళితే ముందుగా సమాచారం ఇవ్వాలి. రోజూ రాత్రి సమయంలో గస్తీ తిరిగేందుకు సిబ్బందిని నియమిస్తాం.

– భీమరాజు, సీఐ, అంబాజీపేట




క్రీడా మైదానం.. నిరుపయోగం

ర్యాలి జడ్పీ పాఠశాలలో క్రీడా మైదానం విశాలంగా ఉన్నా గడ్డి, తుప్పలతో నిండి ఉండటంతో ఆటలకు అనువుగా లేక విద్యార్థులకు ఉపయోగ పడటం లేదు. ఆటస్థలం పల్లంగా ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పాముల సంచారం ఉండటంతో విద్యార్థులు భయపడుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా, సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం



గాంధీజీకి చిత్రనివాళి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని నడవపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు పచ్చిమాల పద్మప్రియ, సవరపు జెస్సీ ఆయన చిత్రం గీసి ఘన నివాళి అర్పించారు. అహింస, శాంతిమార్గంతో ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిగాంచిన గాంధీజీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగాలని కోరుతూ ఈ చిత్రాలు గీశామని వారు తెలిపారు.

పద్మప్రియ గీసిన గాంధీ చిత్రం

రక్తదాన శిబిరం



రక్తదాతలకు సన్మానం

అమలాపురం పట్టణం: అత్యవసర సమయాల్లో రక్తం అందించి ప్రాణదాతలు కావాలని రక్త నిధి వైద్య అధికారిణి పి.అన్నపూర్ణ పేర్కొన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం అమలాపురం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో 40 మంది రక్తం దానం చేశారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన 20 మంది యువకులకు ఆర్ఎంవో డాక్టర్ నాగేంద్రప్రసాద్ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. దొడ్డ కాశీ, రాజశేఖర్, రమణమూర్తి, సురేష్, దండే శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు ప్రారంభం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ముమ్మిడివరం జడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద చెకుముకి సైన్సు సంబరాలు మంగళవారం ప్రారంభించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ పరిమళ పరీక్ష పేపర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు చెకుముకి పరీక్షలు రాశారు. ఈ నెల 27న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు జరుగుతాయన్నారు. జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు కోలా వెంకటేశ్వరరావు, చెకుముకి కన్వీనర్ నేరేడుమిల్లి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష పేపర్లను ఆవిష్కరిస్తున్న డీసీఈబీ కార్యదర్శి

అల్లవరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఓడలరేవు జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలల విభాగంలో అమరావతి పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయులు ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి శివకుమార్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువలో వ్యర్థాలు.. తాగునీరు కలుషితం

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

పట్టణంలోని మురుగు, చెత్త సమస్యలు తాగునీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి. మరోవైపు వర్షాలకు ఎక్కడికక్కడ మురుగు నిల్వచేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పలువురు విష జ్వరాల బారిన పడుతున్నారు.

పంట కాలువలో వ్యర్థాలు..

అమలాపురం పట్టణం పరిధిలోని డంపింగ్ యార్డులో చెత్త వేసేందుకు స్థలం లేదు. బైపాస్ రహదారి వరకు ప్రధాన రహదారిపై చెత్తను పడేస్తున్నారు. అక్కడా చెత్త వేసేందుకు స్థలం లేక పోవడంతో ప్రధాన పంట కాలువ ఒడ్డున పారబోస్తున్నారు. వ్యర్థాలన్నీ పంట కాలువలోకి చేరుతున్నాయి. అమలాపురం నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న 60 మండలాల ప్రజలు ఆ తాగునీటిని వినియోగిస్తున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి..

మండలాలు : 3	జనాభా : 2,10,130
పంచాయతీలు : 60	చెరువులు : 6
ప్రధాన ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టులు : 9	



డంపింగ్ యార్డులో ప్రధాన పంట కాలువలోకి పారబోస్తున్న వ్యర్థాలు

2 లక్షల మందిపై ప్రభావం..

ఇక్కడి డంపింగ్ యార్డు వద్ద ఉన్న ప్రధాన పంట కాలువ అమలాపురం మండలం, పురపాలిక, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాలకు తాగునీటిని అందిస్తోంది. ఈ కాలువలో నీటినే ఆర్‌డబ్ల్యూఎస్ ప్రాజెక్టుల ద్వారా శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారు. పురపాలిక పరిధిలో సేకరించిన చెత్తలో అనేక రకాల వ్యర్థాలు ఉంటున్నాయి. ఆ నీటిలో కొన్నిసార్లు ఈ-కొలై బ్యాక్టీరియా గణనీయంగా వృద్ధి చెందుతుంది. దాని కారణంగా అతిసార వ్యాధి వస్తోంది.

చర్యలు చేపడుతున్నాం

అమలాపురం డంపంగ్ యార్డులో చెత్త తొలగింపు పనులు ప్రారంభించాం. ఇప్పటికే రహదారిపై చెత్త తొలగింపు దాదాపు పూర్తి కావొచ్చింది. పంట కాలువ వైపు ఉన్న దానిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– కేవీఆర్‌ఆర్ రాజు, పురపాలిక కమిషనర్, అమలాపురం

నియామక పత్రాల అందజేత



అభ్యర్థికి పత్రం అందిస్తున్న జేసీ నిశాంతి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఎంపికైన 36 మంది అభ్యర్థులకు జేసీ నిశాంతి నియామక పత్రాలు అంజేశారు. జేసీ మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ఉన్నత స్థానాల సాధించాలని తెలిపారు. వికాస సంస్థ ప్రతినిధి గోళ్ల రమేష్, అభ్యర్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం..

అమలాపురం కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వన్నె చింతలపూడి(సమనస) జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన రూ.15 వేలు మొత్తాన్ని మంగళవారం జేసీ నిశాంతికి అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యార్థులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, ముత్యాల బాబు పాల్గొన్నారు



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

విద్యార్థుల స్వచ్ఛతా హీ సేవ

కాట్రేనికోన, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని చెయ్యేరులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. డీవీఎస్ఎస్ వర్మ, సంతోష్, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై చిత్రలేఖనం..

యానాం: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా మహాత్మాగాంధీ ప్రభుత్వ హైస్కూల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు విద్యాశాఖాధికారి పి. లక్ష్మణప్రవీణ్ తెలిపారు. ప్రధానోపాధ్యాయిని సాజిదా బాను పర్యవేక్షణలో మన వ్యర్థాల నిర్వహణ పోటీలు జరిగాయి.

రేషన్‌కార్డుల విభజనపై విచారణకు కమిటీ

యానాం: కొత్త రేషన్‌కార్డుల కోసం చేసిన దరఖాస్తులపై విచారణ జరిపేందుకు కమిటీ ఏర్పాటు చేసినట్లు పరిపాలనాధికారి, పౌరసరఫరాల అధికారి ఆర్. మునిస్వామి మంగళవారం తెలిపారు. ఈ నెల 7 నుంచి డిసెంబరు 13 వరకు పరిశీలన కమిటీ ప్రాంతాల వారీగా పరిశీలిస్తుందన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

అమలాపురం గ్రామీణం: అమలాపురం మండలం పాలగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మెల్లం భువన సాత్విక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల కాకినాడలో జరిగిన అండర్-17 వాలీబాల్ జిల్లాస్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంట్రు వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. పాఠశాలలో ఆమెను అభినందించారు.

రూపుకోల్పోయిన రహదారి



పల్లం నుంచి నీలరేవు వెళ్లే సీసీ రోడ్డు గుంతలు పడి రాళ్లు పైకి తేలాయి. పదేళ్ల కిందట నిర్మించిన కిలోమీటరు దూరమున్న ఈ రోడ్డు అధ్వానంగా మారింది. సముద్రతీరానికి వెళ్లే పర్యాటకులు, మత్స్యకారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని జేఈ నరహరి దృష్టికి తీసుకువెళ్లగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దశమి ఉత్సవాలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో 3 నుంచి 12వ తేదీ దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వైశ్య సంఘ నాయకులు తెలిపారు. అమలాపురంలోని వేదిక మందిరంలో అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం 108 కళశాలతో గడియారస్తంభం వరకు ఊరేగింపు, అమ్మవారికి అభిషేకం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకట చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైశ్య సంఘ నాయకులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



ప్రసంగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రహంతుల్లా

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కక్షిదారులు, పిల్లలను ప్రయోజకులుగా చేసిన తర్వాత వారి నుంచి నిరాదరణకు గురవుతున్న ఎంతో మంది తల్లిదండ్రులు తమ హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహంతుల్లా అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా కొమానపల్లిలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో రహంతుల్లా అధ్యక్షత వహించి మాట్లాడారు. నిరాదరణకు గురై ఇబ్బందులు పడుతున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, సర్పంచి కాశి ఇందిర, కార్యదర్శి కె. దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

కాట్రేనికోన: చదువుకునే విద్యార్థులకు చట్టాలపై కనీస అవగాహన ఉండాలని కాట్రేనికోన ఎస్సై అవినాష్ పేర్కొన్నారు. పి.లక్ష్మీవాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వరలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన చట్టాలపై ఎస్సై అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలకు ఉన్న హక్కులు, చట్టాలు, గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలికల భద్రత, సైబర్ నేరాల గురించి వివరించారు.

మురుగు కాలువపై నిర్మాణం

అమలాపురం పట్టణం: అమలాపురంలోని ముస్లిం వీధిలో మురుగు కాలువపై నిర్మాణం చేపట్టారు. దీంతో మురుగు ముందుకు వెళ్లే దారిలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం అడిగేవారులేరని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ వెంకటేష్‌ను వివరణ కోరగా మురుగు కాలువపై నిర్మాణం తొలగించే ఏర్పాట్లు చేస్తామన్నారు.



ప్రతినెలా నివేదికలు ఇవ్వాలి: ఎల్జీ ఆదేశం

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలోని ప్రభుత్వశాఖలను పర్యవేక్షిస్తున్న కార్యదర్శులు, డైరెక్టర్లు ప్రతినెలా యానాం, కారైకాల్, మాహేలలో పర్యటించి సమగ్ర నివేదిక ఇవ్వాలని లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయ అధికారి ఎన్. ఉదయకుమార్ తెలిపారు. ప్రతినెలా పర్యటించి సమస్యలపై మూడు రోజుల్లో తనకు నివేదిక పంపించాలని ఎల్జీ ఆదేశించారన్నారు.



అడ్డుగా పిచ్చిమొక్కలు, ఇటుకలు

అమలాపురంలోని ప్రకాశంవీధి ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డుపైకి వచ్చేశాయి. ఇటుకలను రహదారిపైనే వదిలేశారు. దాంతో అటుగా వెళ్లే వాహనదారులు, స్థానికులకు ఇబ్బందిగా ఉంది. దీనిపై సచివాలయ కార్యదర్శి దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా సిబ్బందితో తొలగించే చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

నాయకులకు బాలయోగి ఆదర్శం



ఎదుర్లంకలో కేకు కోస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

న్యూస్‌టుడే బృందం: లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగిని రాజకీయ నాయకులంతా ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఐ.పోలవరం మండలం ఎదుర్లకం, పాతయింజరం గ్రామాల్లో బాలయోగి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఎంపీ హరీష్ మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, పలువురు తెదేపా నాయకులు పూలమాలలువేసి నివాళి అర్పించారు. కాట్రేనికోన గేటు సెంటరులో ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. నాగిడి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ● యానాంలో సమాచారశాఖ ఆధ్వర్యంలో బాలయోగి విగ్రహాలకు పరిపాలనాధికారి ఆర్. మునిస్వామి, సీఐ షణ్ముగం, ఎస్సైలు ప్రభాకర్, నూకరాజు, ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ● జిల్లా రవాణాశాఖ అధికారి కార్యాలయంలో ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, డీటీవో శ్రీనివాసరావు, ఎంహెచ్‌వో రవికుమార్, కౌశిక్ తదితరులు బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాశి అర్పించారు. ● పోలమ్మచెరువుగట్టు వద్ద బాలయోగి విగ్రహానికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ● ఉప్పలగుప్తం బాలయోగి పార్కులోని బాలయోగి విగ్రహానికి కూటమి నాయకులు నివాళి అర్పించారు. నానాజీ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టు వద్ద..

'స్వర్ణాంధ్ర' విజేతలు వీరే..



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో కమలకుమారి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర పోటీలలో విద్యార్థులు విజయం సాధించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారిణి కమలకుమారి పేర్కొన్నారు. కొంకాపల్లి మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు మంగళవారం నిర్వహించారు. 64 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. డీఈవో కమలకుమారి, డీఈవైవో సూర్యప్రకాశం విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు.



గుంతల రోడ్డుతో ఇక్కట్లే..

విలసవిల్లి గ్రామంలో ఆలయాల సముదాయం వద్ద రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. అడపాదడపా పడుతున్న వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి రోజుల తరబడి ఉండిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ దారిని నిర్మించాలని కోరుతున్నారు. దీనిపై సర్పంచి సలాది ఊర్మిళాదేవి మాట్లాడుతూ ఈ రహదారికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి తెలిపారు. పెదగాడవిల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని వరిక్షేత్రాలను పరిశీలించారు. ఏరువాక సైంటిస్ట్ ఎం.నందకిషోర్, అమలాపురం ఏడీఏ ఎం.ఏ.షంషీ, డీఆర్సీ ఏడీఏ ఏవీ రాజశేఖర్, ఏవోలు పాల్గొన్నారు.



పెదగాడవిల్లిలో వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

జీవన ఎరువులతో భూసారం

ముమ్మిడివరం: వరి సాగులో జీవన ఎరువుల వినియోగంతో భూసారాన్ని పెంపొందించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ వై.జ్యోతిర్మయి సూచించారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంక రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మాట్లాడారు. వెదజల్లే పద్ధతిలో సాగు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.ఎం.నందకిశోర్ మాట్లాడుతూ తుపాను కారణంగా కురిసిన అధిక వర్షాలు, తర్వాత ఎండ తీవ్రత, అధిక నత్రజని వినియోగం వంటి వాటి కారణంగా బ్యాక్టీరియా ఆకు ఎండు తెలుగు వ్యాప్తి పెరిగిందన్నారు. ఏడీఏ రాజశేఖర్, పొత్తూరి మల్లికార్జున వర్మ, రామకృష్ణంరాజు, పత్సమట్ల సత్యనారాయణరాజు, పెద్దిరెడ్డి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళలో విద్యార్థిని ప్రతిభ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయిలో క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ నిర్వహించిన చిత్రకళా పోటీల్లో చల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని లంకే ప్రసన్న ప్రతిభ కనబరిచింది. కాకినాడలో నిర్వహించిన చిత్రకళా ప్రదర్శనలో సంస్థ అధినేత అకొండి అంజి చేతుల మీదుగా అవార్డు అందుకుంది. పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు చవటపల్లి దుర్గారావు, హెచ్ఎం గరిమెళ్ళ స్వామి ప్రసాద్, ఉపాధ్యాయులు ప్రసన్నను అభినందించారు.

స్మార్త విద్యార్థులకు భవనం నిర్మించాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురంలోని స్మార్త విద్యార్థులు విద్యాభ్యాసం నిర్వహించడానికి సాంఘిక భవనం నిర్మించాలని ఎంపీ హరీష్‌మాథుర్‌ను స్మార్త పండితులు కోరారు. అమలాపురంలోని ఎంపీ హరీష్‌కు ఆపస్తంభ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో పండితులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కోనసీమ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన విజయాదిత్య శర్మను ఎంపీ అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

సమస్య: నడవపల్లి పరిధిలోని కొన్నివీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – స్థానికులు

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి పల్లవి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

చెత్త తొలగించారు

సమస్య: చెయ్యేరు పంచాయతీ పరిధిలో రోడ్డును ఆనుకుని చెత్త పేరుకు పోయింది. పంచాయతీ అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: ఈ సమస్యను సర్పంచి చెల్లి సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు చేయించారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

నేడు గ్రామసభలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల ఆవరణలో నేడు గ్రామసభలు నిర్వహించనున్నామని ఎంపీడీవో వెంకటాచలం తెలిపారు. ఈ సభలో ఉపాధిహామీ పనులు గుర్తింపు, ఇతర అభివృద్ధి అంశాలపై చర్చిస్తారన్నారు.

విద్యార్థులకు పోటీలు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర ఎంతైనా ఉందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఎస్.భాస్కర్ గణేష్ అన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గొల్లవిల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, సీఎస్ఎం కళాశాల విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



గొల్లవిల్లిలో పింఛను నగదుతో లబ్ధిదారులు

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది మంగళవారం సాయంత్రానికి 99 శాతం పింఛన్ల నగదును లబ్ధిదారులకు అందజేశారని ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎం.ఎల్.ఎన్.మూర్తి తెలిపారు.

ఆసుపత్రిలో అందిన కానుక

ఉప్పలగుప్తం: మొదటిరోజే పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు పింఛను నగదు అందజేయడానికి సచివాలయ సిబ్బంది శ్రమించారు. ఉప్పలగుప్తం మండలం సరిపల్లికి చెందిన చవటపల్లి వీరాస్వామి వెన్నుపూస సంబంధిత సమస్యతో అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గోపవరం సచివాలయ సిబ్బంది షేక్ షాహేద, గొలకోటి గాంధీ ఆసుపత్రికి వెళ్లి పింఛను నగదు అందజేసి తమ ఔదార్యాన్ని చాటారు.



ఆసుపత్రిలో నగదు అందజేస్తున్న సిబ్బంది

పక్క జిల్లా వెళ్లి..



కోడేరులో..

అమలాపురం పట్టణం: పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరులో ఉన్న వృద్ధురాలికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ రూ.6వేలను సచివాలయ కార్యదర్శి బండి వీరన్న మంగళవారం అందజేశారు. అమలాపురం పట్టణం ఆరో వార్డులో వంగవీటి మోహన్ రంగా నగర్‌లో ఉంటున్న కురసాల రత్నం తీవ్ర అనారోగ్యం కారణంగా మంచం నుంచి లేవలేని పరిస్థితిలో ఉన్నారు.

మండపేట

•మండపేట • రామచంద్రపురం

రక్తదాన శిబిరం



రక్తం ఇస్తున్న యువకులు

రామచంద్రపురం: రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళవారం జాతీయ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. లయన్ జి.వి.రావు డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. జిల్లా బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు తాగరు మూర్తి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మాణిక్యం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. శ్యామ్ అండ్ ఫ్రెండ్స్, ఎన్జీఓ సేవాసమితి, పిల్లి అప్పారావు సేవాసమితి ద్వారా కొన్ని సంవత్సరాల నుంచి రక్తదానం చేస్తున్నందుకు అభినందిస్తూ మాజీ వైస్ ఎంపీపీ వాసంశెట్టి శ్యామ్‌ను మంగళవారం ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ డాక్టర్ల ఆధ్వర్యంలో సత్కరించారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థి దశనుంచి అలవరుచుకోవాలని జనవిజ్ఞాన వేదిక పూర్వపు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చల్లా రవికుమార్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి ప్రతిభా పరీక్షలు పట్టణం, రూరల్ ప్రాంతాల్లో నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రవికుమార్ ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందజేశారు. జేవీవీ జిల్లా కార్యదర్శి గండి స్వామి ప్రసాద్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.గోపాలకృష్ణారెడ్డి, బొమ్మిడి రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఔరా.. చిన్నారుల ప్రతిభ



గాంధీజీ చిత్రాలతో విద్యార్థినులు

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్.ప్రవళిక జాహ్నవి, వి.దేవి, జి.సాయిదుర్గ, ఎస్.ప్రియాంకలు చిత్రలేఖన ఉపాధ్యాయుడు దారా వెంకటేష్ పర్యవేక్షణలో జనుము, రాగులు, కాఫీ పొడి, గుంటలు తదితర వస్తువులతో గాంధీ చిత్రాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎ.రాజు, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

ద్రాక్షారామ: గాంధీజయంతిని పురస్కరించుకుని సరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాయుడు వీరభద్రప్రసాద్ పర్యవేక్షణలో గాంధీచిత్రాలు వేయించారు. విద్యార్థులు పి.వేణుబాబు, పి.లక్ష్మీప్రసన్న, పి.సూర్యపవన్ కల్యాణ్ వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు కెవిఎన్ కుమారి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.



గీసిన చిత్రాలతో చిన్నారులు

మహాత్ముడిని నిత్యం స్మరించుకుందాం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మా గాంధీ అంటే నాటి నేటి తరం వాళ్లకు అందరికీ తెలుసు. అలాంటి మహాత్ముడు రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో నడయాడిన మధుర స్మృతులను ఇప్పటికీ మిగిల్చారు. రామచంద్రపురానికి కిలోమీటరు దూరంలో కాకినాడ రోడ్డులో ఉన్న చోడవరం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధుడు మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో వ్యవసాయ మంత్రిగా చేసిన జిక్కిన వెంకటరత్నం ఇల్లు ఇప్పటికీ గాంధీజీ మధుర స్మృతులను గుర్తు చేస్తుంది. పట్టణంలో తిలక్ మెమోరియల్ టౌన్‌హాలు, కేంద్ర సహకార బ్యాంకు భవనాలు ఆయనే నిర్మించారు. ఈ సమయంలో రైతులకు, ప్రజలకు వెంకటరత్నం చేస్తున్న సేవలకుగాను ఆయనను గాంధీజీ మెచ్చుకున్నారని పెద్దలు చెబుతారు. వెంకటరత్నం కోరిక మేరకు 1929 మే 1వ తేదీన రామచంద్రపురం వచ్చిన మహాత్మా గాంధీ ఆరోజు రాత్రి చోడవరంలో ఆయన ఇంట్లోనే బస చేశారు.



గాంధీజీ 1 మే 1929న రాత్రి బసచేసిన చోడవరంలో జిక్కిన వెంకటరత్నం ఇల్లు

తిలక్ మెమోరియల్ టౌన్‌హాలులో ప్రసంగం

రామచంద్రపురం-మండపేట రోడ్డులో ఉన్న తిలక్ మెమోరియల్ టౌన్‌హాలు తెలియజేసవద్దంలో తెలియని వారుండరు. ఇదే వేదికగా రాజకీయ సభావేశాలు నడిపితే వారికి విజయం తథ్యమన్న నమ్మకం ఇప్పటి రాజకీయ నాయకులు పాటిస్తున్నారు. 1930లో స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా విజయవాడ జాతీయ కాంగ్రెస్ సమావేశం నిమిత్తం రెండోసారి రామచంద్రపురం వచ్చిన మహాత్మా గాంధీ తిలక్ మెమోరియల్ టౌన్‌హాలులో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అక్కడ నుంచే ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కొద్దిసేపు టౌన్‌హాలులో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉద్యమ కార్యాచరణపై గాంధీజీ ముచ్చటించారని చెబుతారు.



1930లో గాంధీజీ ఉపన్యసించిన తిలక్ మెమోరియల్ టౌన్‌హాలు ప్రాంగణం ఇదే

రహదారికి తాత్కాలిక మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

రాయవరం: మండలంలో అధ్వానంగా ఉన్న వెదురుపాక ప్రధాన రహదారిపై ఉన్న గుంతలకు ర.భ. శాఖ అధికారులు మంగళవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. రహదారిపై వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులపై గత నెల 30న 'ఈనాడు'లో ప్రచురితమైన 'గుంతల్లో ప్రయాణం... యాతనల్లో జనం' కథనానికి ర.భ. డీఈఈ వెంకట సత్యసూర్యనారాయణరావు స్పందించారు. వర్షాలకు భారీగా గుంతలు పడటంతో రహదారి ఛిద్రమైందని, గుంతలను రెడ్ గ్రావెల్‌తో పూడ్చుతున్నామని డీఈఈ తెలిపారు. వార్షిక నిధులు మంజూరు కాగానే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతామన్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



వెదురుపాక-రాయవరం రహదారికి గ్రావెల్‌తో పనులు

గాంధీజీ స్ఫూర్తి.. మన గంగవరం సేవాసంస్థ దీప్తి

పామర్రు: ఎవరికైనా సాయం చేస్తే మరిచిపోవాలి. ఇతరులు చేసిన సాయాన్ని మాత్రం తప్పకుండా గుర్తుంచుకోవాలి. ఎవరికైనా ఏదైనా పని చేయాలా వద్దా అనే విషయంలో ముఖ్యంగా యువతకు ఏదైనా గందరగోళం ఉంటే అలాంటి వారు అత్యంత నిరుపేదలైన వారి గురించి, సామాజిక స్ఫూర్తి గురించి ఆలోచించాలి. చేయబోయేపని అతనికి, వారికి ఉపయోగపడుతుందో లేదో గమనించాలని గాంధీజీ అనేవారు. కె.గంగవరంలోని 'మన గంగవరం' సేవా సంస్థ వారు సరిగ్గా దీనినే ఆలోచించుకుని ఆచరణలో పెడుతున్నారు.

ప్రజోపయోగ కార్యక్రమాల్లో... మండలకేంద్రం కె.గంగవరం గ్రామాన్ని ఆదర్శంగా ఉంచాలని గ్రామ యువత అనుకుంది. అందరూ తలో చేయి వేసి గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరచాలనుకున్నారు. సమస్యల్లేని గ్రామంగా తీర్చి దిద్దాలని, బాపూ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకురావడానికి అంతా కలిసికట్టుగా పనిచేయాలని భావించారు. వారంతా ఎక్కడ ఎన్ని పనుల్లో ఉన్నా జన్మభూమిపై మమకారాన్ని వదులుకోలేకపోయారు. చరవాణిలు, వాట్సాప్‌లు, ముఖపుస్తకాల ద్వారా ఒకరి నొకరు కలుసుకున్నారు. యువత గురించి గాంధీజీ చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు.. మూడేళ్ల క్రిందట అందరూ కలిసి మనగంగవరం సేవాసంస్థను ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు ఇతర గ్రామ పండుగల సందర్భాల్లో వారు కలుసుకుంటుంటారు. గ్రామంలో ఇప్పటికే మెగా వైద్యశిబిరాలు పెట్టారు. రక్తదానాలు చేశారు. రహదారుల పక్కన మొక్కలు నాటించారు. అందరినీ కలుపుకుని భారీ ఎత్తున సంక్రాంతి సంబరాలు చేశారు. ఇలా సేవాకార్యక్రమాల్లో వారు దూసుకుపోతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు

ముందస్తు దసరా సంబరాలు

రామచంద్రపురం: విద్యార్థులకు దసరా విశిష్టతను తెలిపేందుకు సెలవులకు ముందు రోజున రామచంద్రపురం భాష్యం స్కూల్లో ముందస్తు దసరా సంబరాలు మంగళవారం అలరించాయి. ప్రిన్సిపల్ పి.భాస్కర రావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.




ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

ఘనంగా అన్నసమారాధన

అంగర: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా కపిలేశ్వరపురంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. అంగర, తాతపూడి, సత్యనారాయణపురం గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

రావి ఆకుపై 'జాతిపిత' తైలవర్ణం



రాయవరం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను పురస్కరించుకుని రాయవరానికి చెందిన చిత్రకారుడు ఇందుగమెల్లి సౌదాగర్ రావి ఆకుపై చిత్రీకరించిన 'బాపూజీ' తైలవర్ణం పలువురిని ఆకట్టుకుంది. దేశానికి స్వాతంత్ర్యం కోసం శాంతియుత ఉద్యమాలతో బ్రిటిష్ పాలకులను గడ గడలాడించిన గాంధీజీకి నివాళి అర్పించేందుకు రెండు గంటల వ్యవధిలో రావి ఆకుపై వాటర్ కలర్స్‌తో చిత్రాన్ని గీసినట్లు మంగళవారం సౌదాగర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ఊరూవాడా పింఛన్ల పంపిణీ

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం తెల్లవారుజాము నుంచి జరిగింది. పేదలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛను సొమ్ము ఒకే సారి పెంచి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే 13, 14 వార్డుల్లో పలువురికి పింఛన్లు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మహిళకు పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే.

ద్వారపూడి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం మండలంలోని ద్వారపూడి, జడ్.మేడపాడు, కేశవరం గ్రామాల్లో ప్రారంభించారు. కూటమి నాయకులు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



ప్రభుత్వ పాఠశాలలో సీడ్ బాల్స్ తయారు చేస్తున్న బాలికలు

ద్వారపూడి: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు కోటి సీడ్ బాల్స్ తయారీలో భాగంగా మండపేట మండలం ద్వారపూడి గ్రామం జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో ద్వారపూడి వాసవి క్లబ్, వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారు చేయించే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల చేతులమీదుగా మట్టిని సేకరించి విత్తనాలను మట్టి ఉండలలో పెట్టి సుమారు 10 వేల సీడ్ బాల్స్ తయారు చేయించి ప్రభుత్వానికి అందజేస్తామని, వాటిని అడవుల్లో వెదజల్లితే చెట్ల పెంపకం పెరుగుతుందని వాసవి, వనిత క్లబ్ సభ్యులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు తట్టవర్తి రమేష్, వనితా క్లబ్ అధ్యక్షురాలు తట్టవర్తి శ్రీదేవి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కంకటాల మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు విజయజ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పద్ధతులతోనే అధిక దిగుబడి

రాయవరం: మూస పద్ధతికి స్వస్తి పలికి వరిసాగులో శాస్త్ర సాంకేతిక పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధ్యమని రాయవరం మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలో మాచవరం, పసలపూడి రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పశు సంవర్ధకశాఖ వైద్యాధికారులు శ్రావణి, విజయ్, మార్కెటింగ్ శాఖ అధికారి సతీష్ ,మాచవరం సర్పంచి కత్తుల సీతామహాలక్ష్మి, మేడపాటి అశోక్‌రెడ్డి, రిమ్మలపూడి బ్రహ్మారావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రభాకర్

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం, వేగాయమ్మపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. వ్యవసాయ అధికారి సత్యప్రసాద్ మాట్లాడుతూ యంత్రాలు, ధాన్యం కొనుగోలు పద్ధతులను వివరించారు. మండల పశు వైద్యాధికారి ఎం.కృష్ణార్జున, వెంకటాయపాలెం సర్పంచి యల్లమిల్లి సతీష్ కుమారి రైతులు పాల్గొన్నారు.

మహనీయులకు ఇదేనా మనమిచ్చే గౌరవం..!



కపిలేశ్వరపురం మండలం వడ్లమూరులో జాతిపిత మహాత్మ గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను మూడేళ్లుగా మూలన పెట్టేశారు. స్థానిక ఆర్య వైశ్య సంఘం సభ్యుడు కొల్లూరి శ్రీవెంకటేశ్వర్లు 2018లో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల వద్ద గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం గ్రామంలో చేపట్టిన డ్రయిన్ నిర్మాణ సమయంలో విగ్రహాలు అడ్డుగా ఉన్నాయని చెప్పి అక్కడి నుంచి తొలగించారు. అప్పటి నుంచి రోడ్డు పక్కన అలాగే వదిలేయడంతో విగ్రహాల రూపురేఖలు మారిపోతున్నాయని, వాటిని మరో ప్రదేశంలోనైనా తిరిగి నెలకొల్పాలని వెంకటేశ్వర్లు, స్థానికులు కోరుతున్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ, రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు విగ్రహాలకు రక్షణ కల్పించాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, అంగర

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ సంబరాలు

పామర్రు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి మూఢనమ్మకాలను దూరం చేసేలా విజ్ఞానశాస్త్రం తోడ్పడుతుందని, అందుకు జనవిజ్ఞానవేదిక కృషి చేస్తోందని ఆప్కాస్ట్ జిల్లా అకడమిక్ సమన్వయకర్త ప్రక్కి వీరబ్రహ్మానందం అన్నారు. కె.గంగవరంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి క్విజ్ పోటీలు జరిగాయి. పది ఉన్నత పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. సత్యవాడకు చెందిన హర్షకుమార్, పి.డి.ఎస్.కృష్ణ, సిద్ధార్థలు ప్రథమ స్థానాన్ని, సుందరపల్లికి చెందిన మధులత, సందీప్, క్రాంతిలు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జనవిజ్ఞానవేదిక మండల గౌరవాధ్యక్షుడు చిట్టూరి రామ్మోహన్‌రావు, ఎంఈవోలు చోడిశెట్టి ఆంజనేయులు, అలజంగి నాగరాజు, ఎస్సై షేక్ జానీబాషా, ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మాగాపు ప్రదీప్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

అంగర: కపిలేశ్వరపురం మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో టేకి, వాకతిప్ప, నల్లూరు ఉన్నత పాఠశాల టీమ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోనూ, ప్రవేటు విభాగంలో అంగర రామకృష్ణ ఉన్నత పాఠశాల టీమ్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి శ్రీనివాస్, పి.లెనిన్ బాబు పాల్గొన్నారు.



కె.గంగవరంలో బహుమతుల అందజేత



అంగరలో విజేతలతో నిర్వాహకులు

ద్రాక్షారామ: రామచంద్రపురం రూరల్ ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలస్థాయి చెకుముకి పోటీ పరీక్షను నిర్వహించారు. మొత్తం 20 పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నట్లు చెకుముకి రూరల్ కన్వీనరు రెడ్డి కనక రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా హసనబాద, నరసాపురపుపేట, వెంకటాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలు, ప్రయివేటు పాఠశాలల్లో సూర్య ఉన్నత పాఠశాల, గాయత్రి తిలక్ విద్యానికేతన్, సత్యం ఇంగ్లీషుమీడియం పాఠశాలలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో రూరల్ జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షురాలు పసుపులేటి మెహర్‌సుజాత, ట్రెజరర్ నాగ్రేంద, పాఠశాల ప్రధానోపాధ్యాయుని సీహెచ్ రత్నపద్మావతి, పర్యవేక్షకులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతలు



సత్తాచాటిన సూర్యపాఠశాల విద్యార్థి

కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: కాకినాడలో సోమవారం జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి గవర్నమెంట్ స్కూల్ కరాటే పోటీల్లో ద్రాక్షారామ సూర్యపాఠశాల విద్యార్థి అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచాడు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న వి.మహేష్‌కార్తీక్ సత్తాచాటి ప్రథమ స్థానం కైవసం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపిక



రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెంటూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని **మేడిశెట్టి లక్ష్మీప్రసన్న** రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపికైంది. మంగళవారం ప్రధానోపాధ్యాయులు డి.సత్తిరాజు మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థి లక్ష్మీప్రసన్న ఎస్‌జీటీ (స్కూల్ గేమ్ ఫెడరేషన్) అండర్-14 బాలికల హాకీ విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనుందన్నారు. హాకీలో అత్యుత్తమ ప్రదర్శనతో విద్యార్థిని సెలెక్టర్ల దృష్టిని ఆకట్టుకుందన్నారు. క్రీడా పరికరాలను అందజేసిన రిమ్మలపూడి వేణుగోపాలదొరను, విద్యార్థికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ రాఘవను అభినందించారు. గ్రామానికి చెందిన క్రీడాకారిణి జిల్లా హాకీ జట్టుకు ఎంపిక కావడం పట్ల సర్పంచి వాసంశెట్టి వెంకట్రావు, ఉపసర్పంచి నున్న కృష్ణ ప్రదీప్‌కుమార్, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యుడు వాసంశెట్టి విజయ్‌కుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్య సేవలపై అవగాహన

అంగర: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను వృద్ధులంతా వినియోగించుకోవాలని వైద్యాధికారిణి డా.విజయదీపిక అన్నారు. కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం పీహెచ్‌సీలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ అరవైఏళ్ల పైబడిన వారికి ఎముకలు, కంటి సంబంధిత వ్యాధులు సహజంగా వస్తాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ స్థలదాత చుండ్రు అమ్మన్న, వైద్యాధికారిణి డా.అలేఖ్య, ఎంపీహెచ్ఈవో గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ వెంకటరమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

27వ వార్డు కౌన్సిలర్ మృతి



రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణం 27వ వార్డు కౌన్సిలర్ **కట్టా శ్రీరాములు(74)** అనారోగ్య కారణంగా మంగళవారం కన్నుమూశారు. ఆయన బీసీ సంక్షేమ వసతి గృహ వార్డెన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం వైకాపా నుంచి 2021 మార్చిలో జరిగిన పురపాలక ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచారు. ఆయన మృతిపట్ల ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మున్సిపల్ పార్టీ విప్ సీనియర్ కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఛైర్మన్‌లు కోలమూరి శివాజి, పెంటపాటి దేవి, తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

మొక్కలతో శుభవేడుక



మొక్కలతో మహిళా అతిథులు

ద్వారపూడి, న్యూస్‌టుడే: ఇంట్లో శుభకార్యం జరిగిందంటే వచ్చిన అతిథులకు తిరిగి గిఫ్ట్ ఇచ్చి పంపడం ఆనవాయితీ మారింది. అది ఎవరి హోదాకు తగ్గట్లు వారు తమ బహుమతి ఇస్తుంటారు. అయితే ద్వారపూడిలో మంగళవారం జరిగిన శుభకార్యంలో వచ్చిన అతిథులకు మొక్కలు పంపిణీ చేశారు. మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాకచర్ల నాగభాస్కరరావు తన మనుమరాలి వేడుక వినూత్నంగా చేసి ఆదర్శంగా నిలిచారు. పేరంటానికి వచ్చిన అతిథులకు మొక్కలను బహుమతిగా అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ ఆలోచన చేసినట్లు నాగభాస్కరరావు తెలిపారు.

5న పీహెచ్‌సీలో ప్రత్యేక బ్లాక్ ప్రారంభం

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బలుసు రుద్రయ్య మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బలుసు జానకి రామయ్య పర్యవేక్షణలో నిర్మించిన ప్రత్యేక బ్లాక్ నిర్మాణాన్ని ఈ నెల 5న ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జానకిరామయ్య మాట్లాడుతూ దివంగత బలుసు రుద్రయ్య కుమారుడు డా.సుబ్బారావు, భార్య వసుంధర జ్ఞాపకార్థం అంగర పీహెచ్‌సీకి రూ.75 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. అందులో భాగంగా ప్రత్యేక బ్లాక్‌ను నిర్మించినట్లు తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుల చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

మండపేట గ్రామీణం: కలెక్టర్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తేజేశ్వరరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ల జాబితా విషయంపై చర్చించారు. వివిధ పార్టీల నాయకులు యరమాటి వెంకన్నబాబు, కాశిన కాశీవిశ్వనాథం, ఎం.సుబ్బారావు, నామాల చంద్రరావు పాల్గొన్నారు.

రుచి.. శుచికరమైన భోజనం

బాటసారులకు ఆసరాగా అన్న క్యాంటీన్

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పేద వర్గాల, దినసరి కూలీల, కార్మికుల కడుపు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లకే అన్న క్యాంటీన్లలో రుచికరమైన భోజనం అందిస్తోంది. 2014-19 మధ్యలో తెదేపా ప్రభుత్వం అక్షయ పాత్ర సహకారంతో పేదల ఆకలి తీర్చేలా వీటిని ఏర్పాటు చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక క్యాంటీన్లు తొలగించింది. గత ఎన్నికల హామీల అమలులో భాగంగా కూటమి ప్రభుత్వం ఆగస్టు 16న రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించింది. ఈ క్రమంలో మండపేట ప్రభుత్వ కళాశాల పక్కన ఉన్న క్యాంటీన్‌ను ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు పలు గ్రామాల నుంచి వచ్చినవారు, వృద్ధులు, కార్మికులు, కూలీలు, ఆదరణలేనివారికి ఎంతోమందికి అన్నక్యాంటీన్ ఆసరాగా ఉంటోంది. ఏదైనా హోటల్‌కు వెళితే కనీసం రూ.90 నుంచి రూ.100 ఖర్చుచేయాల్సి వస్తోంది. ఇంత మొత్తం చెల్లించలేని కూలీలు, నిరుపేదలు వెచ్చించే అవకాశం ఉండేది లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరు పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించడంతో రూ.5లకే రుచికరమైన భోజనం చేస్తున్నారు. ప్రతి రోజూ వెయ్యమంది ఆకలి తీర్చుకుంటున్న ఈ క్యాంటీన్‌కి పుట్టినరోజు, తదితర కార్యక్రమాలకు సంబంధించి పేదలకు ఒక రోజు ఉచితంగా భోజనం అందించేలా కూటమి నాయకులు, స్థానికులు ముందుకు వస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో ఒక కర్రి, సాంబారు, పెరుగు అందిస్తున్నారు.



క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలు

ఆప్యాయంగా పలకరిస్తున్నారు



పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డి గూడెం నుంచి ఆటో డ్రైవర్‌గా మండపేటకు వచ్చి సరకు దిగుమతి చేసి వెళ్తున్నాం. మధ్యాహ్నం అన్న క్యాంటీన్‌కు వచ్చాను. భోజనం వడ్డించే సిబ్బంది ఎంతో ఆప్యాయంగా పలకరిస్తున్నారు. భోజనం రుచిగా, శుచిగా ఉంది. ఆకలితో ఉన్న పేదలకు అన్నం పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం.

- అన్నవరం, జంగారెడ్డి గూడెం

చాలా ఉపయుక్తంగా ఉంది



మేము చిన్నపాటి వ్యాపారం చేస్తుంటాం. ప్లాస్టిక్, పాత బట్టలు, పలు వస్తువులను ఇంటింటికి వెళ్లి అమ్ముతాం. మధ్యాహ్నం అయ్యే సరికి మేము తెచ్చుకున్న ఆహారాన్ని తిని పనిని కొనసాగించాల్సి వచ్చేది. ప్రస్తుతం అన్న క్యాంటిన్ వల్ల తాము వ్యాపారం చేసి మధ్యాహ్నం భోజనం చేసి తిరిగి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాం. ఇలా మాలాంటి వారు రోజూ 70 మంది తింటారు.

- దుర్గ, సంచార వ్యాపారులు

కళాశాలలో పలు పోటీలు

మండపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి సూచనలు అనే అంశంపై మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర 2047 పోటీలు జరిగాయి. వక్తృత్వ, వ్యాసరచన పోటీలను వేగుళ్ల సూర్యారావు గ్రంథాలయ భవనంలో నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కళాశాల లైబ్రేరియన్ పి.వెంకన్న, తెలుగు అధ్యాపకులు మధుకుమార్, హిస్టరీ అధ్యాపకులు ఎస్.రాజేష్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందిస్తామని కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆనందరావు తెలిపారు.